# తలుపుగొళ్లెం

పైడీ, రాజూ —
రెండూ తీసేస్తే మనిషే మిగుల్తాడు.
లేక,
మిగలనే మిగలడా ?
ఏమో ? !

• • • •

పైడ్రాజు కళ్ళుతెరిచి, చీకట్లో కళ్ళు చిట్లించి, కెవ్వున కేకలేసి ఏడ్చినప్పటికి తెల్లవారుఝామున సరిగ్గా నాలుగ్గంటలయింది.

రోడ్డువార చెట్టుకింద పడుకున్న ముష్టి దంపతుల్లో, భర్తకంటె భార్య ముందుగా లేచి, కాలవ్వారకి వెళ్ళేసరికి, అక్కడ కానాకింద పైడ్రాజు ఎడ్చేఏడుపు ఆమెకి వినిపించింది; ఆవెంటనే దగ్గరగా వెళ్ళి చూస్తే, పైడ్రాజు ఆమెకి కనిపించేడు. పైడ్రాజునిచూసి ఆమె. "ఎవరు నీవు ? నీ పేరేమి ? నీ తలిదండ్రు లెవరు ? నీ విట్లు వగచుటకు కతం బేమి ?", అంటూ ప్రశ్నించ లేదు. జవాబు చెప్పే పరిస్థితిలో లేడు

పైడ్రాజు, అతను పుట్టి మహా అయుంటే ఓ గంట సేపు అయుం టుంది అప్పటికి.

బాలుడు మాత్రం బాలార్కుళ్ళా ఉన్నాడు.

భార్య వెంటనే వెళ్ళి భర్తతో సంప్రతించింది :

ముష్టిభర్త, "భలే, బాగుందిలే ! బలే బలే !" అన్నాడు.

ఆ "దంపతుల అభీష్టానుసారం పైడ్రాజు, కుళ్ళు కాలవ్వార నుంచి రోడ్డుమీది చెట్టు కిందకి ప్రమోషన్ పొందేడు.

మానవమాత్రుడైన పైడ్రాజు సంఘంలోకి ఆ విధంగా దిగేడు. తలుపు గొళ్ళాళ్ళో దిగలేదు.

కుర్రవాడికి ప్రమోషన్ వచ్చిన వెంటనే పేరు రాలేదు. ఓ ఏడాదిపాటు ప్రొబేషన్ పిరియడ్లో ఉన్నాడు. ఆ ఏడాదిలోనూ ముష్టి దంపతులకి దశ తిరిగింది.

వాళ్ళు, ముందు, పైడ్రాజుకి కాలో చెయ్యో విరిచేదాం అనుకున్నారు. బాలుడి దీనావస్థ చూపించి భిక్షం ఎక్కువ లాగవచ్చునని వాళ్ళు అభిప్రాయ పడ్డారు. పిల్లడు లక్షణంగా కళకళ్లాడుతూండడం చూసి ఆ ఘోరమైన ప్రయత్నానికి కొన్నాళ్ళు వాయిదా వేసి, ఆ తరవాత ఆ విరుపుడు ప్రయత్నం పూర్తిగా విరమించుకున్నారు. ఎందుచేతనంటే —

వాళ్ళకి పైడ్రాజు రాకతో రాజయోగం పట్టింది. వాళ్ళ బతుకులో వాళ్ళకి నాలుగేండ్ల పాటు బంగారు పంటలు పండేయి. వాళ్ళకి ఎక్కడికెళ్తే అక్కడే ముష్టి ! కాటకం తరవాత వర్షాలు కురిసినట్టయింది వాళ్ళకి. ఆ దంపతులేకాని పండితులైతే ! వాళ్ళు "పైడ్రాజు"కి బదులు ఋష్యశృంగడని పేరు పెట్టుకొనుందురు పైడ్రాజుకి.

కుర్రవాడు దొరికిన ఏడాదికి వాణ్ని సింహాచలం తీసుకువెళ్ళి,

పుట్టుజుత్తులు తీయించి, వాడు తమపాలిట బంగారపు రాజు కాబట్టి వాడికి పైడ్రాజని పేరు పెట్టుకున్నారు ముష్టి దంపతులు.

ఏడాదయింది. రెండు, మూడు, నాలుగేళ్ళయింది. ఆ దంపతుల దశ పంచకళ్యాణి గుర్రంలా పరిగెట్టింది. నాలుగేళ్ళు గడిచి అయిదోఏడు ప్రవేశించింది. అంతలో, వాళ్ళమీద మబ్బులేని పిడుగు పడింది; వాళ్ళ రాజయోగానికి బ్రేకుపడింది.

భగవంతుడే ఆదిభిక్షువు.

ఆదివిద్యల్లో యాచన ఒకటి.

అలాగే, ఆ విద్యల్లో దొంగతనం ఇంకొకటి. దొంగతనం జరగడంవల్లనే విష్ణుమూర్తి వారు భూమ్మీదికి దిగడమే కాకుండా చేపగా మారి గంగలోకి దిగవలసివచ్చింది. అప్పట్నించీకూడా భూమ్మీద మనిషికి ముఖ్యమైన పనుల్లో

మొదటిది : దొంగతనం చేయడం :

రెండవది : దొంగల్ని పట్టుకు శిక్షించడం ;

మనిషి జీవితమూ మానవ చరిత్రా రెండూ అందులో ఉన్నాయి.

మానవులంతా సమానులు. ఎందుచేత నంటే, మానవులంతా దుష్టులే ! మహారాజు మత్సరగ్రస్తుడైతే, కూలివాళ్ళు మత్సరగ్రస్తులెందరు లేరు ? ! రారాజులు దొంగలైతే, ముష్టిదొంగలు ఊరంతా దేశంనిండా ఉన్నారే ! అందుచేత (సామ్యవాదం తగదు తగదు ! !) మానవులు సమానులుగా ఉండవలసిన అవసరంలేదు.

పైడ్రాజువల్ల కలిగిన సిరివల్ల, కలిగిన పొగరువల్ల చిందులు తొక్కే ముష్టి దంపతుల్ని చూసి, వేరొక దంపతులు చాలా అసూయ పడ్డారు. అసూయపడి వాళ్ళొక మాంచి రాత్రి ముహూర్తం చూసి పైడ్రాజుని ఎత్తుకుపోయేరు.

దాన్తో పైడ్రాజుకి జీవితంలో ఇంకొక వింతఘట్టం ప్రారంభ మయింది.

పైడ్రాజుని ఎత్తుకుపోయిన దంపతులు, చాలా విచిత్రమైన దంప తులు. వారిలో భర్తకి భార్య నిజంగా అర్ధాంగే. ఆమె అతన్లో సరిగ్గా సగానికి సగం మాత్రం ఉండేది; అతను సింహం ఐతే ఆమె గుంట నక్క, అతను గండు పిల్లి అయితే ఆమె చుంచెలక, అతను ఎలకనీ నక్కను నమ్మిన పిల్లీ సింహం, అతను రాజే అయితే ఆమె అతణ్ని ప్రేమించే పరిచారిక. అతను అందానికి యముడే అయితే, ఆమె యమదూతిక. అతను కాలిన ఇనుము రంగులో ఉంటే, ఆమె నూనెరాసిన మినుమురంగులో ఉండేది. ఒకర్నొకరు వాళ్ళు చాలా గాఢంగా అమితంగా ప్రేమించుకొనేవారు. లైలా మజ్నూలైనాసరే వాళ్ళ ప్రేమని చూసి అసూయపడి చావాలన్నమాట.

పైడ్రాజు తన ముష్టి మాతా పితరుల గురించి మొదట్లో రెండు మూడు వారాల పాటు బెంగపెట్టేసుకున్నాడు. కాని, అతని నూతన జీవితం అతనికి చాలా వింతగా తోచింది. త్వరలోనే ఆ జీవితం అత నికి అమితమైన ఉత్సాహమిచ్చింది.

కొత్త తలిదండ్రులు తాము కొత్తగా తెచ్చుకున్న కొడుక్కి పూర్తిగా గుండు చేయించి నుదుటిమీద ఓ వాత పెట్టి, కళ్ళ కొసల్ని రెండు వాతలుపెట్టి అతని రూపు కొంతమట్టుకు మార్చేరు. అంతమంచి చక్కని బిల్డింగుని అంతకంటె డామేజీ చెయ్యడానికి వాళ్ళకున్నూడా మనసుకి కష్టమనిపించిది.

వాతలు మానిన తరువాత పిల్లణ్ని తీసుకొని కొత్తదంపతులు ఊరిమీదకి ముష్టికి బయల్దేరేరు. కొంతదూరం వెళ్లేక తండ్రి, తల్లీ కొడుకుల్తో విడిపోయి, వేరుగా యాచించుకోడం మొదలుపెట్టేడు. తండ్రికి రెండు మూడు ఇళ్లకి వెనగ్గా, కొడుకు చెయ్యి పట్టుకొని

నడుస్తూ, తండ్రిని దృష్టి పథంలో ఉంచుకొని ఇంటింటికీ వెళ్లి యాచిస్తోంది తల్లి.

పగలు పది గంటలు దాటింది, సూర్యుడు భగభగ మండుతున్నాడు. తల్లీ తండ్రీ కొడుకులు— కుటుంబం యావత్తూ ఓ కూలివాడలో యాచించుకొంటూ వెళ్తున్నారు. వాళ్ళకి గింజలు సరిగ్గా పడ్డం లేదు, అందుగురించి కొత్త తలిదండ్రులు బెంగపెట్టుకోకపోడం గమనించేడు పైడ్రాజు.

నెమ్మదిగా కుడికాలు ఈడుస్తూ నడుస్తున్నాడు తండ్రి. యాచించేటప్పుడు అతనలాగే నడిచేవాడు. తల్లి, "అమ్మా! లచ్చిం తల్లీ." అంటూ గుమ్మాల దగ్గర కేకలేస్తూ నడుస్తోంది. పైడ్రాజు దిక్కులు చూస్తూ తల్లి వెనక నడుస్తున్నాడు.

అంతలో, రెండిళ్ళ అవతల ఓ కమ్మల గుడిసెలోకి తన కొత్త తండ్రి దూరడం కనిపెట్టేడు పైడ్రాజు, తండ్రి అలా దూరంగానే, తల్లి గబగబా ఆ ఇంటివద్దకు కొడుకుని తీసుకు నడిచి, "అమ్మా! లచ్చిం తల్లీ! బిచ్చివఁమ్మా, లచ్చింతల్లి?" అంటూ కేకలువేస్తూ నిలబడింది.

ఆ గుడిసెలోకి అలా చూస్తూ నిలబడిపోయేడు పైడ్రాజు.

అక్కడ నడవఅవతల మట్టిగోడలకొక గుమ్మం ఆ గుమ్మానికి రెండు మూసిన తలుపులు. ఆ తలుపులకొక గొళ్లెం, ఆ గొళ్ళానికొక చిరుకప్పా ఉన్నాయి. ఆ తాళంకప్పని టుప్పుక్కున విరగ్గొట్టి, ఆ గొళ్లెం టక్కున తీసి, ఆ తలుపులు ఓరగా తెరిచి, చరచరా వీధిలోకి వెళ్ళిపోయేడు తండ్రి. వెళ్ళిపోయి, పాతిగ్గజాల దూరంలో మరో ఇంటి దగ్గర ముష్టికోసం నిలబడ్డాడు.

"గదిలోకెల్లి గిన్నెలొట్టుకురా!" అని పైడ్రాజుకు పురమాయించింది కొత్త తల్లి. పైడ్రాజుకి మొదట ఏమీ అర్థంకాలేదు. ఆ తరవాత

బోధపడింది.

అంతకుముందు రెండు నెలలపాటు కుర్రవాడికి ట్రెయినింగు ఇచ్చి ఉంచేరు వాళ్ళు. తను తలుపులులేని గుడిసెముందు నిలబడ్డం, లోనికి వెళ్ళమనడ్మ, గిన్నెలు పట్టుకు రమ్మనడం, పైడ్రాజు లోనికి వెళ్ళి అవి తేవడం, తెచ్చి తల్లి జోలిలో వాటిని పడేయడం —

ఆ విధంగా శిక్షణ ఇచ్చి ఉంచేరు.

అందుచేత, తల్లి ఆజ్ఞకి మొదట ఆశ్చర్యపడినప్పటికీ, ఆమె ముఖంలోకి చూసి, గబగబ గదిలోకి వెళ్ళేడు పైడ్రాజు,

గొళ్ళెం తీసి, తలుపులు తెరిచిచూస్తే వాటివెనక ఏముంటుందో వివరంగా, ఆ రోజున తన వళ్ళంతా పులకరించగా, చూసేడు పైడ్రాజు. అతని లేత మనసులో ఆ దృశ్యం అతని నుదుటిమీద మచ్చలాగే, ముద్రించుకుపోయింది. ఏ మూసిన తలుపు గొళ్ళెం చూసినప్పటికీ దాని వెనక ఉండే శాంతినీ సౌఖ్యాన్నీ సంపదనీ ఊహించుకొని అలనాటి తన తొలిఅనుభూతి మళ్ళీ మళ్ళీ పొందుతూ వచ్చేడు అతను చాలా కాలం.

అదొక కూలివాడి గుడిసె, లోపల నల్లటి మట్టిగోడల్ని తెల్లటి సున్నపు చుక్కలు ముత్యాలు మెరిసినట్టు మెరుస్తున్నాయి, బైట ఎంతో ఎండగా ఉంటే ఆ మిద్దెగదిలో ఎంతో చల్లగా వుంది. అందులో ఓ వార ఓ నులకమంచంమీద ఓ మెత్తని బొంతొకటి పరచి వుంది. ఆ మంచం ప్రక్క ఓ పెద్ద నల్లటి పెట్టొకటుంది. నిద్రపోతోన్న వెర్రి గేదెలా వుంది అది. గోడని గూట్లో అమ్మవారి బొమ్మొకటుంది. నిండా నీరుంది కాబోలు, ఓ నల్లనికుండ ఓ వార చల్లని తల్లిలా కూర్చుంది. దాని పిల్లల్లా దాని పక్కనే రెండు కంచుగిన్నెలు తళతళ

లాడ్తూ చెంపా చెంపా రాసుకొంటూ కూర్చున్నాయి. ఆ పూరి గుడిసెలో ఆ మిద్దెగది ఆ సమయంలో పైడ్రాజు కంటికి చిరుస్వర్గంలా కనిపించింది. చల్లగా హాయిగా ఎంతో ప్రశాంతంగా కనిపించే ఆ గదిలో ఆ మంచంమీది బొంతమీద తల్లి కడుపులో పిల్ల పడుకున్నట్టు హాయిగా కళ్ళు మూసుకు పడుకోవాలనిపించిం దతనికి దగ్గరగా వెళ్ళి ఆ బొంత తన లేతచేత్తో తాకిచూసేడతను.

పైనుంచి, ''బేగిరా!'' అని తల్లి వేసిన కేక వినిపించగానే, పైడ్రాజు ఆ మంచ దగ్గరనుండి గిన్నెలవైపు పరిగెట్టి పిల్ల కంచు గిన్నెలు రెండూ పట్టుకొని, గబగబ బైటకి వచ్చేడు. జోలి విప్పి నిల్చుంది తల్లి. పైడ్రాజు ఆ గిన్నెలు జోలిలో పడేయగానే కుఱ్ఱవాడి చెయ్యి పట్టుకొని చల్లగా నడుచుకొంటూ తిరిగి యథాప్రకారం యాచన యాత్ర మొదలుపెట్టింది తల్లి.

ఆ దంపతులు ముష్టిముసుగులో దొంగతనం చేసేవారు. వాళ్ళు దొంగ దంపతులు.

జీవితం వాళ్ళతో చాలా తొడితొక్కిడిగా గడిచింది పైడ్రాజుకి. తలుపుగొళ్లెం చూస్తే చాలు అతని వళ్ళంతా పులకరింపుల్తో నిండిపోయేది.

అయితే, వాళ్ళతో ఆ జీవితంలో కష్టాలు చవిచూడకపోలేదు.

ఓ రోజు రాత్రి పదిగంటలకి ''సివిల్ బట్టల పోలీసోళ్ళు'' వచ్చేరు. వాళ్ళు దొంగ తండ్రిని పిల్చి తీసుకుపోయేరు. రెండు రోజుల తరవాత, దొంగతల్లి పైడ్రాజుని ఏదో పెద్ద చీకటి ఇంటికి తీసుకు వెళ్ళింది. సాయంకాలందాకా ఇద్దరూ చెట్టుకింద పడిగాపులు కాసేరు. సాయంకాలం అవనిచ్చి, తుపాకులు పట్టిన రిజర్వు పోలీసులు దొంగ

తండ్రిని ఎక్కడికో తీసుకుపోయేరు.

"ఎక్కడికి?"

"జెయిలుకి."

"అంటే, అదేటది?"

"సీకటి గొయ్యి."

"ఆళ్లెవుళ్లు?"

"రిజర్వోళ్లు."

"అయేటయి?"

"తుపాకులు."

"ఏటిజేస్తాయి?"

"పేల్తాయి."

"అయ్య మరైతే రాడా?"

"రాడు మూన్నెల్లు."

"ఏం?"

"దొంగలు దొర్కిపోతే అంతే!"

దొంగలు దొరకూడదని ఆ రోజున పాఠం నేర్చుకున్నాడు పైడ్రాజు.

అది జరిగిన ఏడేళ్ళకి,

దొంగ దొరికిపోతే ఎంత ఘోరమైనా జరగవచ్చునని బాగా తెలిసొచ్చింది పైడ్రాజుకి.

మధ్యాహ్నం.

మండుటెండ.

పన్నెండు గంటలు.

ప్లీడర్లు పార్టీలని తినేసినట్టు, పోలీసులు ప్రజల్ని తినేసినట్టు,

జడ్జీలు న్యాయాన్ని తినేసినట్టు సూర్యుడు ఆ రోజున ప్రపంచాన్ని తినేస్తున్నాడు.

పైడ్రాజుకి ఆ రోజున పన్నెండేళ్ళు వెళ్ళేయి. పీతలాగా చురుగ్గా మిరపకాయలా ఉన్నాడు. అప్పటికి ఒక్కసారి మాత్రం కోర్టులో వార్నింగు పొందేడు.

మధ్యాహ్నం.

ప్రతివార్నీ ఆ పన్నెండు గంటలు పట్టుకు తినేస్తున్నాయి, గాలి దుమ్ముమ్మారంగా వీస్తోంది. దొంగతండ్రి ఓ కూలివాడి ఇంటిగొళ్లెం విరగ్గొట్టి హడావిడిగా బైటకి వెళ్ళిపోయేడు.

దొంగతల్లి ఆ ఇంటివైపు గబగబా నడిచి వెళ్ళి నడవలో నిల్చుంది. దొంగ కొడుకు కూలివాడి గదిలోకి వెళ్ళి రెండు చెంబులు పట్టుకువచ్చి, తల్లి జోలిలో పడవేసేడు. జోలితో తల్లి బైటకు వచ్చి నాలుగు అడుగులు వేసింది. పైడ్రాజు ఇంకా నడవలోంచి బైటకి రాలేదు.

అంతలో, ఎవరో "దొంగ! దొంగ!!" అని కేకలేసేరు. ఆ కేక మెరుపులా మెరిసింది, పిడుగులా పడింది.

జోలెలో చెంబులతో పోతోన్న దొంగ తల్లిని ఎవరో వచ్చి యముళ్ళా పట్టుకున్నాడు. ఆ యముడు పదియముళ్ళయే హడావిడిలో పైడ్రాజు వీధిలోకి జారుకోగానే ఆ పది యముళ్ళూ వందమందయేరు.

పైడ్రాజు ఓ సారి ఓ వెర్రికుక్కని చూసేడు. నాలిక జాచుకొని, వెర్రిచూపుతో చావుచూపుతో ఆ వెర్రికుక్క భయంకరంగా వుంది. "వెర్రికుక్క! వెర్రికుక్క!", అని ఎవరో అరిచేరు. ఆ కేక వినగానే పాకల్లోంచి పాటకపుజనం, రాళ్ళతో కర్రలతో కళ్ళనిండా కోపంతో, గుహల్లోంచి సేనలు దిగినట్టు దిగేరు. మనిషి ప్రాణానికి

మహాహాని కలిగించే ఆ వెర్రికుక్కని వాళ్ళంతా తరిమి తరిమి కొట్టి కొట్టి నెత్తురు కక్కించి చంపినప్పుడు పైడ్రాజు భయపడలేదు, అసహ్యించుకోలేదు, కోపించలేదు. తనుకూడా ఆ వెర్రికుక్క మీదకి ఓ చిన్న రాయి విసిరేడు. కాని, మనిషి కష్టాన్ని దోచుకొనే దొంగని అదేవిధంగా, వెర్రికుక్కని కొట్టినట్టు, వాళ్ళంతా తన కళ్ళముందు కొడుతూంటే అతను గజగజలాడేడు. చిల్లరపాముని వాకిట్లో నిర్దయగా మనుషులు కొడుతూంటే, వాకిట కాలవ కన్నంలోంచి పిల్లతాచు ఆ దృశ్యం చూసినట్టు, అతను జనాన్ని అతిభయంతోనూ పరమ దుర్మార్గంగానూ చూసేడు. వాళ్ళంత నిర్దయగా ఉండడం చూసి అతను సహించలేకపోయేడు. వాళ్ళందర్నీ కాటువేసి చంపుదాం అన్నంత కోపం వచ్చిందతనికి. వాళ్ళందర్నీ పగతో, చల్లారని పగతో చూసేడతను. సహాయం చేయలేక, ఆ దృశ్యం చూడలేక, కుతకుత కన్నీరు కారుస్తూ అతను దొంగ తండ్రి వెనక నడుచుకు వెళ్ళిపోయేడు.

ఆ దెబ్బలకు ఆ మర్నాడు ఆ దొంగతల్లి ఆసుపత్రిలో ప్రాణాలు విడిచింది. ఆమె గడిపిన ఆ ఎలక జీవితంలో దైన్యంలేక పోలేదు. కాని, ఆ దైన్యం ఆ సమయంలో ఎవరూ చూడకపోడం న్యాయమో అన్యాయమో భగవంతుడికి తెలియాలి.

కాని, పైడ్రాజు మాత్రం అటువంటి (అ)న్యాయాన్ని క్షమించలేకపోయేడు. ఏ అన్యాయాలు ఏ దుర్మార్గాలకి దారితీస్తాయో, ఏ దుర్మార్గాలు ఏ పరమ ఘోరాలకి దారితీస్తాయో, సంఘంలో ఏ మనిషి ఏయే పరిస్థితుల్లో ఏయే విధాలుగా ఎందుకు వర్తిస్తాడో అతను ఊహించుకోలేదు కాని, కొన్నాళ్ళకి, కొన్నేళ్ళకి తన దొంగతల్లికి జరిగిన అన్యాయం ఏమిటో అతను తెలుసుకున్నాడు.

ఎలకా పిల్లీ ప్రణయం ఎలక జీవితం అంతమవడంతో అంత

మయింది. దొంగ తండ్రి ఇంక ఎలకనిగాని పిల్లివికాని నమ్మలేదు. తెచ్చుకోలేదు. దొంగ కొడుకు అతనికి చేతికి అందివచ్చి తయారు పూర్తయి సిద్ధంగా వున్నాడు, కొడుకు సహాయంతో జీవితం చల్ల చల్లగా వెళ్ళబుచ్చుతున్నాడు దొంగతండ్రి.

నేలమీద ఇళ్ళబేరం కంటె నీటిమీద ఓడలబేరం ఎక్కువ లాభసాటిగా ఉందని అనుభవంమీద తెలుసుకొని, ఊర్లోంచి హార్బర్లోకి పైడ్రాజు తన సాహసరంగాన్ని మార్చేడు. అక్కణ్నించి అతను తెచ్చే సరుకులు దొంగతండ్రి అమ్మి డబ్బు చేసేవాడు. ఆ డబ్బు తోడుదొంగలిద్దరూ, తాగుడుకీ సినీమాలకీ జూదానికీ ఖర్చు చేసుకొనేవారు. పైడ్రాజుకి పద్దెనిమిదో ఏడు రాగానే అతణ్ని ప్రణయ జీవితానిక్కూడా కొంత డబ్బు ఖర్చు చేసుకోనిచ్చేవాడు తండ్రి.

చిన్ననాడెప్పుడో ఒకమారు కోర్టుకి తీసుకువెళ్ళి అక్కడ అతనికొక వార్నింగు యిప్పించడం తప్పి, పైడ్రాజుని భగవంతుడు ఎంత నీచానికి దిగజార్చినప్పటికీ, కోర్టుకి వెళ్ళే పాపానిగ్గాని, పాపాలకి ప్రాయశ్చిత్తం పొందే కష్టానిగ్గాని పాల్పడజేయలేదు. ఆ విధంగా దేముడతణ్ని కాపాడుకొంటూ వచ్చేడనే చెప్పాలి.

కాని, అక్కడ కోర్టులో ఒకసారి దొంగతండ్రి ఇరుక్కుపోయి ఎలా కొట్టుకుపోయేదో కళ్ళారా చూసేసరికి— ప్రపంచం జీవితం— ఇటువంటి విషయాల గురించి ఆలోచించవలసిన అవసరం వున్నదని గ్రహించేడు పైడ్రాజు, మానవసంఘంలో నేరస్థుల్ని పట్టేవారు మానవత్వం మర్చిపోతారనే విషయం అతనికి అర్థం కాకపోయినా, అనుభవం అయింది. అలాగే మానవ సంఘంలో న్యాయనిర్ణేతలు కూడా మానవత్వాన్ని కోల్పోతారనే విషయం అతనికి ఇంకా అర్థమూకాలేదు. అనుభవంలోకి రానూలేదు.

ఏ దేశంలోనైనాసరే ఎక్కడైనాసరే ఏ ఋషీకుర్చీల్లో ఎంత గంభీరంగా ఉండ ప్రయత్నించినాసరే నునుమెత్తని పులుల్లా ఉంటారు, అందమైన తోడేళ్ళలా వుంటారు, లేదా దుక్కబలిసిన గుంటనక్కల్లా వుంటారే తప్ప జడ్జీలెవరూ దయగల మనుషల్లా వుండరు (అనిన్నీ); ఏ దేశంలో ఎక్కడికి వెళ్లి చూసినాసరే, సరసరలాడే తాచులాగో పడ గెత్తిన నాగులాగో లేక తోకమీద నిలబడి నడిచే జెర్రిపోతులాగో ఉంటాడే తప్ప ఏ ప్లీడరూ కూడా మనిషిలా మాత్రం ఉండడు ఉండడు ఛస్తే వుండడు (అనిన్నీ); ఏ దేశంలో ఏ మారుమూల ఏ కోర్టు కి వెళ్ళి చూసినప్పటికీ అక్కడ కనిపించే పోలీసులూ బంట్రోతులూ గుమాస్తాలూ అంతా కూడా పీడించడానికి యముడు పంపిన స్పెషల్ సైపు పిశాచాల్లా ఉంటారే తప్ప మనుష్యుల్లా కనిపించరు, మనుషల్లా ప్రవర్తించరు (అనిన్నీ); ఏ దేశంలోనైనా సరే ఎంత మంచి ఉన్నత న్యాయస్థానమైనాసరే దాని అవరణలో ఎంత మంచి పూలమొక్కలు పెంచినా వాటిని విషపుష్పాలు తప్ప వేరేమీ వికసించవు (అనిన్నీ); అక్కడ ఎంత మంచి చెట్టు ఎంత బాగా ఎదిగినప్పటికీ అది ఆకొక నాలికగాగల వింత రాక్షసిలా ఉంటుంది తప్ప చల్లని చెట్టులా వుండదు (అనిన్నీ); అక్కడ ఏ పచ్చని తీగె సాగినా అది పసరిక పాములా ఉంటుందేతప్ప నునులేత పూదీగెలా వుండదు (అనిన్నీ); అక్కడ పచ్చటి పచ్చిక పరిస్తే అది పచ్చటి నివురుగప్పిన నిప్పుల తివాసీలా వుంటుందే తప్ప మరో విధంగా వుండదు (అనిన్నీ); అక్కడ మానస సరోవరంలాంటి మంచినీటి చెరువు తవ్వితే అది అభాగ్యుల్ని మింగేసే ముసలి మొసలి గొయ్యిగా కుంచించుకుపోతుందే తప్ప చెరువుగా నిల వదు (అనిన్నీ); అన్నెంపున్నె మెరుగని అమాయకపు చిలకల్ని అక్క డికి తెచ్చి పెంచితే అవి అక్కడ గెద్దలుగా ఎదుగుతాయి, చిలకలనే

చంపుతాయి (అనిన్ని); అక్కడ తెల్లని మల్లెపూల మనసులు నాటితే అవి బ్రహ్మచెముడు డొంకలుగా ముళ్ళుముళ్ళుగా చావు చీకటిగా పెరుగుతాయి (అనిన్ని); నాలికతో నిజంతప్ప వేరేదీ ముట్టనివారికి అక్కడికి వచ్చీరాగానే వెయ్యి విషజిహ్వ లొస్తాయి (అనిన్ని); అక్కడ చల్లటినీడ ఉన్నప్పటికి అది ఎండని మింగిన కొండచలవలా ఉంటుందే తప్ప, తాపమార్చి ప్రాణమిచ్చే నీడలా ఉండదు. (అనిన్ని); అక్కడ ఎండ ఉన్నప్పటికీ అది నీడని చంపి నిప్పులు చిమ్మే రక్కసి డేగల పెనురెక్కల విసురులా ఉంటుందే తప్ప, దివాకరుడి దివ్యాతి దివ్యమైన అనుగ్రహంలా ఉండదు (అనిన్ని); అక్కడ భంగవంతుడు పుట్టించిన దేదీ భగవంతుడు పుట్టించినట్టుగా ఉండదు (అనిన్ని); అక్కడ దేముడే వెలిస్తే అతడు తారున చచ్చి అక్కడ తప్పక దెయ్యమే అవుతాడు (అనిన్ని); ఏ దేశంలో ఏ కోర్టులో అయినాసరే తడిగుడ్డలు చల్లగా గొంతులు పిసుకుతాయి ప్రాణాలు తీస్తాయి తప్ప బాహాటంగా కత్తులు రాపాడవు గదలు ఢీకోవు (అనిన్ని); ఏ దేశంలో ఏ కోర్టులో ఎవరు నవ్వినప్పటికీ ఆ నవ్వు రాక్షస వృశ్చి కాలు తోకలతో నవ్వినట్టుంటుందే కాని మానవత్వాన్ని సూచించే మనిషి నవ్వుగా సహజంగా నిర్మలంగా నిష్కల్మషంగా ఉండదు (అనిన్ని); ఏ దేశంలో ఏ కోర్టయినా సరే అది ఎంత చక్కగా ఎంత మంచి పాలరాతితో ఇంద్రభవనంలా స్వర్గహర్మ్యంగా మలచినప్పటికీ అది వెన్వెంటనే గుండెలేని గోరీగా మారి తీరుతుంది (అనిన్ని); ఆ కోర్టు ఎంత "కళ"గా ఉన్నప్పటికీ ఎప్పుడూ తొడతొక్కిడిగా శవాల హడావిడిగా ఉండే శ్మశానంలా ఉంటుందే తప్ప ఇంకో విధంగా ఉండదు (అనిన్ని); ఏడ్చే దౌర్భాగ్యులు తప్ప అక్కడ వేరెవరూ మనుషుల్లా ఉండరు (అనిన్ని); —

పైడ్రాజుకి అప్పటికింకా సరిగా తెలియదు.

కోర్టుకి సాక్ష్యానికి వెళ్ళేముందు పైడ్రాజు తన జీవితంలో ఒక నాడు ఇంకొక తలుపు గొళ్ళెమూ, దాని వెనక దాగిన గదీ చూడ్డం తటస్థించింది. ఆ దృశ్యమూ అంతకుముందు చూసిన కూలివాడి మిద్దె ఇంటి దృశ్యమూ—రెండూ సరిపోల్చుకొని మరొక పాఠం మరికొన్నాళ్ళకి నేర్చుకున్నాడతను.

అది ఎలా జరిగిందంటే ;

హార్బర్‌కి కొత్త ఓడొకటి వచ్చింది. దాని కడుపునిండా ఇంగ్లీషు మందులే ; వాటిలో ముఖ్యమైనవి పెనిసిలిన్ గొట్టాల పాకెట్ల పాకేజీ పెట్టెలు. ఆ పెట్టెల్లో నాలుగు పెట్టెలు భద్రంగా పైకి లాక్కొచ్చి తండ్రిముందు పెట్టేడు పైడ్రాజు.

నాలుగు పాకేజీలనీ ఆప్యాయంగా నలుగురు బిడ్డల్లా కావిలించుకొని,

"చావుకారు కాడికి ఒట్టుకెల్దాం, రా" అన్నాడు దొంగ తండ్రి.

"ఏ చావుకారు ?". అని ప్రశ్నించాడు దొంగకొడుకు.

"మందుల్చావుకారు. మందుల బేరాలన్నీ ఆడియే !"

"కొట్టెక్కడ ?"

"దొంగ సరుకు కొట్టుకాడ కొన్డు. ఇంటికే ఒట్టుకెల్లాల, రేత్తిరి పదయితే బువ్వతిని కూకునుంటాడు. అప్పుడెల్దాం."

రాత్రి పదయింది. తండ్రీ కొడుకులు మందుల పెట్టెల్తో పయనం అయ్యారు.

రాత్రి పదయింది. ఊరికొంచెం దూరంలో పెద్ద ఆవరణలో మఖమల్ చీకటి మధ్య వెండి మేడ నిలబెట్టి అందులో బంగారు దీపాలు పెట్టినట్టు ఆ చీకట్లో పెద్ద బంగాళా ఒకటి ధగధగ

లాడుతోంది. అటు వంటి మేడల్ని దూరంనించి చూసేదేకాని లోనికి వెళ్ళి వాటి నెప్పుడూ చూడలేదు పైడ్రాజు; అదే ప్రథమం.

పెట్టెలు దూరంలో రిక్షాలోంచి దించి, రిక్షావాణ్ని పంపించి వేసి, గేటు దగ్గర వాడితో మాటలాడివచ్చి, మళ్ళీ పెట్టెలతో సహా కొడుకుతో సహా లోనికి వెళ్ళేడు దొంగతండ్రి.

గేటునించి మేడగుమ్మందాకా పచ్చటి మెత్తటి పచ్చిక మధ్య తెల్లని పాలసిమెంటు గచ్చు పరుచుకునుంది. అది అతి మెత్తని గుండెల పరుపుమీద పరచిన నున్నని రాతి పలకలా తోచలేదు పైడ్రాజుకి. మొండెక్కి బండబారిన అతని అరిపాదాలకి ఆ గచ్చు చాలా మృదువుగా చల్లగా హాయిగా త గి లిం ది. అది చాలా చక్కగా ఉన్నదనిపించిం దతనికి. లోపల వరండాలోకి వెళ్ళగానే వాళ్ళమీద విరుచుకుపడిన వేటకుక్క "చావుకారు" వేసిన కేకతో తిన్నగా వెళ్ళి అతని పాదాలు నాకడం పైడ్రాజు మనసులో నాటుకుపోయింది. వరం డాలోంచి మేడ మీదికి పోయే మెట్లు ఎక్కుతూండగా అతనికి ఒక మంచి లోకంలోంచి ఇంకొక ఇంకా మంచిలోకంలోకి వెళ్తున్న ట్టనిపించింది. అది అమెరికావోడి ఓడమీది మేడలా హాయ్ హాయ్ మనిపించింది.

మేడమీది దక్షిణపు వైపు వసారాలోకి ఓ షిప్పురంగు తలుపుల గదొకటుంది. దానికి పొట్టి ఇనపపామువంటి గొళ్ళెం ఒకటుంది. ఆ గొళ్ళెం తీసి గదిలోకి ప్రవేశించేడు షావుకారు.

ఆ గది అంతకి పదింతల సైజులో అన్ని వివరాలతోనూ పైడ్రాజు మనసులో ముద్రించుకు పోయింది. ఆ గదిని అత నెన్నటికీ కూడా మర్చిపోజాలడు,

ఆ గది అద్భుతంగా లేకపోవచ్చు. కాని, అతని కది అద్భుతంగానే కనిపించింది, దొంగల గుహలోకి దూరిన ఆలీబాబాకి కళ్ళు జిగేల్ మన్నట్టు అతనికళ్ళు జిగేల్ జిగేల్ మన్నాయి. జీవితంలో అంత సౌఖ్యం ఉండగలదని అత నెన్నడూ ఊహించుకోలేదు. సినీమాల్లో అటువంటి దృశ్యాలు చూసినప్పటికీ అవి అతనికి గోడమీద మంచి నీడ బొమ్మల్లాగే తోచేయితప్ప నిజంగా తోచలేదు. అద్భుత మనిపించలేదు. పాలమీగడవంటి కోవారంగు గదిలో మీట నొక్కగానే జగ్గుమని వెలగలేదు వెలుగు; కనిపించని దీపాలనుంచి వచ్చే కాంతితో నెమ్మదిగా నిండుకుపోయింది. అదేదో భూ మి అడుగున నాగలోకపు గదిలా అతనికి తోచింది కాని మామూలు గదిలా తోచలేదు. ఆ పాలవెలుగులో ఆ కోవాగదిగోడలు కొరుక్కు తినవచ్చు ననిపించిం దతనికి, గోడల్ని ఉన్న రంగురంగుల బొమ్మలు, పాములు మనుష్యులుగామారి కాముకులుగా గోడల్ని నిలిబడ్డా యనిపించిం దతనికి. అక్కడ సిల్కుతెర కప్పిన పందిరిమంచం నల్ల రోజాపువ్వుల్ని పిండి చేసి, ఆ పూల పిండితో మెత్తినట్టు నిగనిగ లాడుతోంది. అందులో మిలమిల మెరిసే నాగకన్య లెవరైనా నిద్రపోతూంటే అందుకు ఆ సమయంలో పైడ్రాజు ఆశ్చర్యపడక పోడు. ఓ మూల నిల్చున్న బూడిద రంగు ఇనప్పెట్టె అక్కడ ఇంటితోసహా పాతుకుపోయి ఇంటంతటినీ కాపాడే ఇనపభూతంలా ఉంది. అడుగున పరచిన పట్టు తివాసీ, మాయగడ్డిలా మాయదూదిలా, మాయరబ్బర్లా, కాళ్ళకింద పరచిన పాముల పరుపులా అద్భుతంగా ఉంది. ఇనప్పెట్టెమీద గోడని గ జ ల క్ష్మి బొమ్మొకటి, మేకుకి వేళ్ళాడుతూ—నెత్తురు కారినా ముఖంమీంచి నవ్వు చెరగని ఏసుక్రీస్తులా—నవ్వుతోంది. ఆ గది సముద్రం అడుగున దయ్యాలు నిర్మించుకున్న సుందరమైన హర్మ్యంలోని గదిలా ఉంది.

అందులో అగరొత్తుల వాసన పంకా విసురుకి కెరటాలుగా చెదురుతూ గదంతా ఘుమాయిస్తోంది.

"చావుకారు" బాబుకి నలభయ్యేళ్ళవయసు ఉండవచ్చు; అతను తెలుగువాడే కావచ్చు, లేక ఏ సిందీవాడైనా కావచ్చు. అతను ఫలానా జాతి మనిషిలా కాకుండా నానాజాతి సమితి మనిషిలా ఉన్నాడు. అతని తెలుగుమాత్రం యాసగా నేర్చుకున్న తెలుగులా వినపడుతోంది. అతని కళ్ళు పెద్దవి. పెదవులు దళసరివి అందమైనవి, జుట్టు నల్లది నొక్కు-లది; అతని చూపు చాలా ప్రశాంతంగా కడుపునిండా ఎలకల్ని తిని తనివితీరా పాలు తాగిన పిల్లి చూపులా ఉంది. అతని రంగు చర్మం కింది చర్మంరంగులో మైనపు మనిషి రంగులో రోజూ బాదంనూనె రాసుకు స్నానం చేసి మెరిసినట్టుగా మెరుస్తోంది. అతను చాలా మంచి వేదాంతిలాగా ఎంతో చక్కని రాజు లాగా ఉన్నాడు.

ఆ "చావుకారు" పైడ్రాజుచేతా దొంగ తండ్రిచేత ఆ పెట్టెలన్నీ విప్పించేడు; అన్నీ తనిఖీ చేసేడు. తనిఖీ చేసినప్పుడు అవి తనకి అక్కర్లేనివాళ్ళా తణిఖీ చేసేడు. అవి పెనిసిలిన్ మందులుకావు చావు పురుగు లన్నట్టుగా వాటిని అసహ్యంగా చూసేడు.

"ఏమి కావాల్రా !" అని అడిగేడు షావుకారు.

"మూడొంద లిప్పించీ బాబూ !" అన్నాడు దొంగతండ్రి.

"ఒక్క వెయ్యిరూపాయ లొద్దురా ? ఏమిరా ?"

"నువ్వెప్పుడూ ఆలాగ్గే అన్నావు కాని...."

"ఏమిరా ? చెప్పరా ! రెండువెయ్యాలు కావాల్రా ?"

"బేరం ఏటిబాబూ ! పాతిక్కొట్టేసి మూడొంద లిప్పించీ బాబూ !"

"యాపై ఇస్తాన్రా"

"పోనీ, రొండొంద లిచ్చీబాబూ !"

"పైసా ఎక్కువ లేదరా !"

"ఏటిబాబూ ? ! నీకు నాయెం అనిపిస్తె రిచ్చా చార్జీలూ కాపీకి పావల్దబ్బులూఇచ్చి పొమ్మనకూడదా ? యాపైకూడా ఎందుకేటి ?"

"పోలీసువాడికి ఫోన్ చేసి పిలమంటావురా ?"

"ఏటిబాబూ నూటయాభై ఇచ్చీ బాబూ ?"

ఆఖరికి బేరం నూర్రూపాయలకి సెటిల్ అయింది. సంతోషం పట్టలేకపోయేడు పైడ్రాజు,

ఇనపభూతానికి (దానికి గొళ్లెం ?) కడుపు తెరిచేడు, చావుకారు ! అందులో ఏముందో చూడ్డానికి పైడ్రాజు కుతూహల పడ్డాడు కాని, చూసే అవకాశం లేకపోయింది. ఉంపుడుకత్తెని ఇంకెవరికీ చూపించని ముసలి రాజుగారిలా, ఆ షావుకారు, వాళ్ళకి ఆ ఇనప్పెట్టె కనిపించకుండా అడ్డుగా నిల్చొని, తలుపు బాగా గట్టిగా పూర్తిగా బిగించేక కాని దొంగలవైపు తిరిగేడు కాడు.

పదిపదులు కరకరలాడేయి, చెడిపోయిన ముసలమ్మలవంటి నోట్లే చూసేడు కాని, కొత్త కన్నెపిల్లలా ఉండే అంత మంచి నోట్లని అంతకుముం దెప్పుడూ చూడలేదు పైడ్రాజు.

"దొంగనోట్లు కావుకద ?" అని అనుమానంగానూ నవ్వుతూనూ కూడా అడిగేడు దొంగతండ్రి.

పట్టుకువెళ్ళి పోలీస్వాడికి చూపిచ్చి అడగరా !", అని వెటకారంగా అన్నాడు షావుకారు.

"నాను దొంగని, నువ్వు చావుకారివి ! ఇద్దరం ఒక్కలాటో

ళ్ళ వేచ్చి అందుకడిగినాను. దొంగనోట్లయితే, నీపేరే సెప్తాను."

"సెప్పరా ! పోరా !" అని నవ్వేడు షావుకారు.

నూర్రూపాయలూ పట్టుకొని తండ్రీ కొడుకులు చెంగుచెంగున బైటికి వచ్చేరు.

"బాబొరే ! అలాంటి మేడుండాల్రా !" అన్నాడు పైడ్రాజు.

"ఎయ్యి రూపాయిల్లు చరుకు ఒంద కెగరేసుకుపోనాడు ! మేడ లేపినా డంటే లేపడా ?"

అన్నాడు దొంగతండ్రి. ఆ మందుల ఖరీదు నాలుగువే లుంటుం దని అతనికి తెలియదు.

దిబ్బగాణ్ని కొట్టే దేముళ్ళా కనిపించే డా సమయంలో ఆ షావుకారు, పైడ్రాజుకి.

తండ్రీ కొడుకూ కలిసి కులాసాగా ఇంటికి వెళ్ళిపోయారు.

ఆ మర్నాడు ఓ "గోరం" జరిగింది.

దొంగతండ్రికి చాలా కాలంనుంచీ దాంపత్య సౌఖ్యం సరిగా లేకపోవడంచేత, కాసు చేతిలో పడగానే ఆ సౌఖ్యం కొంత కావలసి వచ్చిం దతనికి. ఆ రాత్రి అతను సంచుల సూరిగాడు కంపెనీలో తప్పతాగి, ఆ హుషార్లో అక్కడ ఒక ఆడమనిషికి పాతిక రూపాయి లిచ్చి ఆ అమరసౌఖ్యం కాస్తా అనుభవించీసేడు.

మర్నాడు పోలీసువారు రొటీన్‌గా సంచుల సూరిగాణ్ని భోగట్టా చేయగా వాడు, దొంగతండ్రి విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నట్టు వారికి తెలియజేసేడు. వాళ్ళు వెంటనే వెళ్ళి, దొంగతండ్రిని స్టేషన్‌కి మోసుకుపోయి అంతడబ్బు ఎక్కణ్ణించి తెచ్చేవని ప్రశ్నించేరు. దొంగతండ్రి చెప్పలేదు. అ త ణ్ని పోలీసువారు నాలుగురోజులు స్టేషన్లో ఉంచేరు. ఉంచి, అతని వీపుకి మొండిలాఠీలే చూపించారో,

లేక అతని నోటికి ఫారిన్ విస్కీలే ఇచ్చేరో లేక రూపాయి నల్లమందే ఉపయోగించేరో కాని, నాలుగురోజులకల్లా వాళ్ళకి కథంతా పూర్తిగా (కొడుకుని మినహాయించి) తెలిసిపోయింది,

తరవాత —

పైడ్రాజుకి చాలా ఆశ్చర్యం వేసింది.

దొంగతండ్రి ఫలానా తారీఖునాటి రాత్రి షిప్పులోంచి ఒక పెన్సిలిన్ పాకేజిపెట్టె చోరీచేసి అర్థరాత్రి సమయంలో ఆ పాకేజి మోసుకు వస్తోండగా అనుమానంమీద పోలీసువారు ఆపి చెక్ చేయగా అతని నేరం తెలియవచ్చిందని పోలీసువారు అతడిమీద కేసు పెట్టేరు.

పైడ్రాజు చాలా ఆశ్చర్యపోయేడు.

మిగతా మూడు పాకేజీలూ ఏవి? షావుకారు ఏమయేడు? తండ్రిని ఓ విధంగా పట్టుకొని ఇంకోవిధంగా ఎందుకు కేసు పెట్టేరు?

ఆ ప్రశ్నలకి సమాధానా లేమిటో ఆలోచించగానే అతనికి వెంటనే అర్థమయింది

దొంగ తండ్రి తను దొంగతనం చెయ్యలేదనీ (నిజమే! పైడ్రాజు చేసేడు దొంగతనం), ఆ పాకేజీ పెట్టె ఫలానా "చావుకారు"గారి దగ్గర్నించి పోలీసువారు స్వాధీనపర్చుకున్నారు కాని తనదగ్గర్నించి కాదనీ (అదీ నిజమే) కేసులో వాదించేడు.

మేజిస్ట్రేటుగారు దొంగతండ్రికి ఆర్నెల్లు జెయిలు వేసేరు. అందుగురించి దొంగతండ్రి చలించలేదు. పైడ్రాజుకి మాత్రం అదొక షాక్‌లా తగిలి, నిద్రలోంచి మెలకువ వచ్చినట్టయిందతనికి. అతను ఎన్నో విషయాల గురించి నెమ్మది నెమ్మదిగా ఆలోచిస్తూండగానే ఆర్నెల్లూ జరిగిపోయేయి.

దొంగతండ్రి, జెయిల్నించి బైటకి రాగానే కొడుకుతో మాట్లాడి ఆలోంచుకొని, "అయితే రేపు ఎల్దారి" అని నిశ్చయం చేసుకొని, ఆ మర్నాడు ఉదయాన్నే లేచి పెన్సిలిన్ షావుకారుగారి ఇంటికి కొడుకుని వెంటబెట్టుకు వెళ్ళేడు,

పొద్దున్న ఆరు గంటలయింది, అంతటా ఇంకా మంచు కప్పుకొనే వుంది. సూర్యుడు తడిగా లేచేడు. షావుకార్‌గారి భార్య జాతైన కుక్కని పట్టుకొని ఉద్యానవనంలో విహరిస్తుండగా, ఆమె వెనుక కుక్క వెనుక (నైటు డ్రెస్సులో) ఆమె భర్త నడుస్తూండగా దొంగ తండ్రీకొడుకులు వెళ్ళి అతణ్ణి అటకాయించేరు.

"నువ్వు పెల్లంతొ పువ్వుల్తోట్లో చికారు కొడతఉండు. నా నెల్లి జెయిలు కొల్సుకొస్తంటాను!" అన్నాడు దొంగతండ్రి.

షావుకారు దంపతులు నిలబడిపోయేరు. షావుకారు ఆ దొంగల్ని పాముల్లా చూస్తే అతని భార్య వాళ్ళని పురుగుల్లా చూస్తూ నిలబడింది.

"సొమ్మూ సోకూ నీకు! ఆర్నెల్లు జయిలు కొలువు నాకు! ఆర్నెల్లకీ ఆరు యాపైలు మూడొంద లియ్యి! ఒల్లకుంటాను! ఇవ్వక పోయావా?– నువ్వావుడొవుడి దగ్గర ఏటేటి కొన్నావో పెసల్ (పోలీసు) పార్టీకి ఇన్‌పర్‌మేస నిచ్చేస్తాను!! అలా ఇవ్వకపోతే నా నొక తల్లికీ తండ్రికీ పుట్టినోణ్ణి కాను!?" అని కేకలు వేసేడు దొంగతండ్రి.

షావుకారు ఫుల్ డ్రెస్సులో లేడు; నైటుడ్రెస్‌లో ఉన్నాడు. అందుచేత కదనరంగంలో కవచం లేకపోతే రాజుగారు భయపడ్డట్టు అతను కొంచెం భయపడ్డాడు. "పొండి పొండి" అన్నాడే కాని ఆ మాటలు ధైర్యంగా అనలేదు. అతనా సమయంలో బెదిరిన దొంగ జంతువులా ఉన్నాడే తప్ప రాజులాగా లేడు, వేదాంతిలాగా లేడు. సహా

యం కోసం కుక్కవైపు దీనంగా చూసేదే కాని, ప్రయోజనం లేక పోయింది. ఆ కుక్కకి పౌరుషం కంటె షోకెక్కువ. అది డ్రాయింగ్ రూం కుక్కకాని వార్‌ఫీల్డు కుక్క కాదు. అదివరకు తన దగ్గరుండే వేటకుక్కని అమెరికన్ దొరసానికి బహుమానంగా ఇచ్చేసినందుకు ఆ క్షణంలో ఎంతో చింతించేడు షావుకారు.

కుక్కవైపు దీనంగా చూడ్డంలో "చావుకారు వైడియా" గ్రహించిన దొంగతండ్రి, "అలాటి ఏసికాలేస్తే కుక్క మెడా నీ మెడా కలిపి ఇరిసేస్తాను" అని ఎమర్జన్సీలో తను ఏ విధంగా ప్రవర్తించేదీ షావుకారుకి తెలియజేసేడు.

షావుకారికి వాళ్ళని చంపేదాం అనిపించింది. ఐడియా కలగడం సులభమే; దాన్ని ఆచరణలో పెట్టడం ఎలాగ? అంతలో,

అంతవరకూ ఇదంతా చూస్తూ ఎడంగా ఉండి ఏదో ఆలోచిస్తూ నిల్చున్న "చావుకారు పెల్లం" తెరముందు కొచ్చింది.

ఆవిడ షావుకార్‌గారి ఒకే ఒక భార్య కాని, ముగ్గురు భార్యల సైజులో ఉంటుంది. ఆవిడ చాలా అందంగా కూడా ఉంటుంది. మెరుపు తీగె కొన్ని టన్నుల బరువుంటే ఆవిడ మెరుపు తీగెలాగే ఉంటుంది. షావుకారు మంచి సరసుడైతే ఆవిడ మంచి సరసురాలు. కాని, ఇద్దరు సరసులమధ్యా సరసతా లేదు, సామరస్యమూ లేదు. అతను వేరేగా సరసుడు. ఆమె వేరేవేరేగా సరసురాలు: అంతే కాదు, లాయర్ల భాషలో చెప్పాలంటే; నెగెటివ్‌గా వాళ్ళిద్దరిమధ్యా ప్రేమ లేకపోడమే కాకుండా పాజిటివ్‌గా వారిద్దరిమధ్యా వైషమ్యం ఉంది. కవిభాషలో చెప్పాలంటే: ఒకరి యెడల ఒకరికి ఉండే వారి కోపాలకేగాని రూపాలొస్తే అవి పులులుగా మారి ఒకదాని మీదొకటి విరుచుకుపడి దెబ్బలాడతాయి. వారిరువురూ ఆ విధంగా ఉండడానికి కారణం "డబ్బు"

అని కొందరూ, "చుట్టాలు" అని ఇంకొందరూ, "రెండూను" అని ఇంకొందరూ అంటారు

షావుకార్‌గారికి ఇంటికి చేరిన తమ్ముడొకడున్నాడు. అందుకు పోటీగా అత నిభార్యకి ఆమె పంచని చేరిన తమ్ముడొకడున్నాడు. తన తమ్ముడికి మెరుపుతీగెలంటే ఇష్టమేమోననే ఘోరమైన అనుమానం ఒకటి షావుకార్ని ఇటీవల ఆవహించింది. ఆమె తమ్ముడికి వి స్కీ బుడ్లంటే ఇష్టం అని షావుకార్ గారికి స్పష్టంగా తెలియనే తెలుసు. భార్యాభర్తలు ఆ విధంగా ఒకర్నొకరు ద్వేషించుకొన్నప్పటికీ వారి వారి తమ్ముళ్ళు మాత్రం చాలా చాలా మంచి ప్రాణస్నేహితులు.

జనాభా జబ్బు పెరిగిపోయి భారద్దేశానికీ, తెల్లదేశాలకీ దెబ్బ రాకుండా షావుకార్‌గారు భార్యని మోతాదుగా ఇద్దరే పిల్లల్ని కననిచ్చి అక్కడితో ఫుల్‌స్టాపు పెట్టేసేరు. అతనికి పదేళ్ళ కొడుకూ ఎనిమిదేళ్ళ కూతురూ ఉన్నారు. వారిద్దరంటే అతనికి ఈ మధ్యవరకూ పంచప్రాణాలూను. కాని ఈ మధ్య ఒక రోజున అతనికొక ఘోరమైన సంశయం వచ్చింది, ఆ ఇద్దర్లోనూ ఒకరు తన సంతానం కాదేమోననే ప్రళయసంశయం అతణ్ని పీడించ నారంభించింది. ఆ ఇద్దర్లోనూ__ కొడుకా ? లేక, కూతురా ? ఎవరు తనవారు కారు ? తేల్చుకోలేక పోతున్నాడతను. అతను తీవ్రమైన బాధతో కొట్టుకుపోతున్నాడు. పీనల్‌కోడ్‌లో ఉరిశిక్ష లేకపోతే అతను మీట నొక్కి తన మెరుపుతీగెని ఏనాడో ఆర్పేసి వుండును.

కావి, ఆ రోజున,

ఆపదలో ఉన్న భర్తకి భార్య ఏ కారణం చేతనో అడ్డుపడి,

"ఎంతో కొంత పారేస్తే తీరిపోయేదానికి ఏంటి ఈ గోల?" అని భర్తని చీవాట్లు పెట్టి, దొంగతండ్రితో "మూడు వందలు లేదు,

వందిస్తారు. అది తీసుకు పో! అంతే! మళ్ళీ కనిపించేవంటే పోలీస్‌కి నిన్ను అయ్యగారు కాదు, నే నప్పజెప్తాను! తెలిసిందా ?" అని ఖచ్చితంగా చాలా గంభీరంగా చెప్పింది.

దొంగతండ్రి ఆమెని మెచ్చుకున్నాడు. చస్తే చస్తానుగాని నూటాయాభై రూపాయీలు మాత్రం "ఆడిచేత కక్కిస్తాను" అనే పట్టుదలతో వచ్చేడతను. "దమ్మిడీ తక్కువైతే పుచ్చుకోను" అని నిశ్చయించుకొని వచ్చేడతను. కాని కొన్ని గంటలు బేరం ఆడితేగాని షావుకారు దగ్గర్నుంచి ఆ డబ్బు పెగలదని అతనికి తెలుసు.

కాని "చావుకారు పెల్లం" మధ్యలో అడ్డువచ్చి అంకె తగ్గించి నప్పటికీ బేరం పొడిగించకుండా వ్యవహారం ఛట్‌ఫట్‌మని సెటిల్ చేసినందుకు దొంగతండ్రి ఆ మెరుపు తీగెని మెచ్చుకున్నాడు,

"సెబాస్ తల్లీ ! సేబాస్ ! సెట్‌పట్ లాడించేసి తునితగువు జేయిస్సినావు. బేస్ ! మరైతే ఒప్పుడు రమ్మని సెలవు ?"

తీగె వచ్చి తనని తెరవెనక్కి పంపించి వేసినందుకు షావుకారు చిమచిమ లాడుతూ తనింకా తెరముందే ఉన్నానని తెలియ జేయడానికి గట్టిగా.

"ఆస్క్ ది ఫెలో టు కమ్ ఎట్ టెన్ !" అన్నాడు.

"రాత్రి పదిగంటలకి రారా !", అని దొంగతండ్రితో చెప్పి, ఏదో ఆలోచిస్తూ నిలబడిపోయింది షావుకారమ్మ.

రాత్రి తొమ్మిదిన్నరకే వెళ్ళేరు తండ్రీ కొడుకులు. గేటుదాకా వెళ్ళేక దొంగ తండ్రి పైడ్రాజుతో "ఒరే అయ్యా ! నువ్వు పైన కాయిరా, లోపలికి రమ్మని ఏటిజేస్తాడో ఏటో ?.... ఆడిమొకం, ఆడు ఏటీ జెయ్యలే దనుకో; అయినా, నువ్వు పైనకాయి. నానుబేగా బైటకి రాకపోతే కేకెయ్యి", అని చెప్పి కొడుకుని బైట కాపలా ఉంచేడు.

ఉంచి, గుర్ఖాతో మాట్లాడి లోనికి వెళ్ధాం అనుకున్నాడు. కాని, ఆరాత్రి ఎందుచేతనో గాని గుర్ఖావాడు అక్కడలేడు. గేటు తెరచి, లోపలకివెళ్ళి గేటుమూసి, మేడ గుమ్మంవైపు నడిచేడు దొంగతండ్రి.

మేడకి దక్షిణంగా విశాలమైన ఖాళీజాగా ఒకటుంది. అందులో జీబుజీబుగా ఏవేవో చెట్లున్నాయి. అక్కణ్నించి చూస్తే, మేడ ఇంటి దక్షిణభాగం స్పష్టంగా కనిపిస్తుంది.

పైడ్రాజు ఆ చెట్లికిందికి వెళ్ళి కూర్చున్నాడు. అక్కడ చాలా హాయిగా ఉన్నదనిపించిం దతనికి. పైన వంకరచంద్రుడు సరదాగా చెట్టుకొమ్మల్తో ఆడుకొంటున్నాడు. చెట్టుకొమ్మలు సరదాగా చల్ల గాలితో ఆడుకొంటున్నాయి. ఇంకా ఎవరెవరితో సరదాగా ఆడుకొం దికో చల్లగాలి ఇంకా ఎక్కడెక్కడకో వెళ్ళిపోతోంది. ఆ ఆటలమధ్య పెళ్ళిపందిట్లో ఆడపిల్లల కళ్ళల్లా, మెరుపుచుక్కలు హుషారెక్కిపోయి తళతళ మెరుస్తున్నాయి.

అక్కడ ఆ కూర్చున్న నిమిషంలోనే మైమరచి కూర్చున్నాడు పైడ్రాజు. "అప్పనంగా" నూర్రూపాయ లొస్తాయనో మరెందుచేతనో అతను ఆ సమయంలో చాలా ఉత్సాహంగా కంటె చాలా సంతోషంగా ఉన్నాడు.

షావుకార్ గారి మేడమీద దక్షిణపు వసారా అతనికి ఎదురుగా కనిపిస్తోంది. ఆ వసారాలో దీపంలేదు, వెన్నెలమాత్రం ఏటవాలుగా పడుతోంది. ఆ మసక వెలుగులో షావుకార్ గారి గది పైడ్రాజుకి అస్పష్టంగా కనిపిస్తోంది, ఆ గదిలోని అందాన్నీ సౌఖ్యాన్నీ తల్చు కొంటే మనసంతా మధురాతి మధురమైపోయింది పైడ్రాజుకి.

అంతలో, ఆగది తలుపులు అతి సన్నంగా విచ్చుకున్నాయి. గదిలోని వెలుగు సన్నని ఆ తలుపుసందులోంచి సన్నగా నిప్పులకొర డాలా, వజ్రపుకత్తిలా కనిపించి అంతలోనే టక్కున ఆరింది.

వరండాలోకి తన దొంగతండ్రి రావడం గమనించేడు పైడ్రాజు.

షావుకార్ గదివైపు హుషారుగా నడిచి వెళ్ళి ఆ గది తప్పలు టకటకమనితట్టాడు దొంగతండ్రి. ఆ తట్టడం పైడ్రాజుకి స్పష్టంగా విని పించింది. తట్టిన అరనిమిషానికి ఒక తలుపు తెరచుకున్నట్టని పించింది పైడ్రాజుకి. వెంటనే నీటిలో మునిగిపోయినట్టు దొంగతండ్రి ఆచీకటి గదిలో మునిగిపోయేడు.

గదిలో దీపం లేదేమని పైడ్రాజు ఆశ్చర్య పడుతూండగానే ఓ వింత జరిగింది.

దాన్తో, పైడ్రాజు నిలబడిపోయేడు.

అతని గుండెల్ని ఏదోభయం చుట్టుకొంది.

తలుపు తెరచుకోగానే, దొంగతండ్రి ఆ గదిలో మునిగిపోగానే, ఆ గదిలోంచి ఎవరో గప్పున బైటకురావడం, వచ్చి గది తలుపు వెంటనే బిడాయించడం, బిడాయించి దానికి గొళ్ళెం పెట్టడం, పెట్టి రయ్యిమని వసారాలోంచి మెట్లవైపు పరిగెట్టడం — అంతా త్రుటి కాలంలో జరిగిపోయింది.

దొంగతనానికి అలవాటు పడ్డ పైడ్రాజు కూడా ఆ దృశ్యం చూసి చలించి భయపడ్డాడు. చల్లగాలి అతణ్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. వంకరచంద్రుడు విషపునవ్వు నవ్వినట్టనిపించిం దతనికి — మెరుపు చుక్కలు దయ్యపు కళ్ళల్లా కనిపించే యతనికి. చెట్టుకొమ్మలు గడ్డకట్టిన రాక్షసి బొగ్గు పొగల్లా తోచే యతనికి.

అతనికి దబదబమంటూ భయంకరమైన చప్పుడు వినిపించింది. తన గుండెలే అలా చప్పుడు చేస్తున్నాయనుకున్నాడతను. కాదు ! ఆ మేడమీద గది తలుపులు — తన నెవరో దయ్యంపట్టుకుంటే పారిపోవ

దానికి ప్రయత్నించినట్టు—దబదబ దబదబ చప్పుడు చేస్తున్నాడు తన దొంగతండ్రి !

ఎవరూ రాలేదు, ఆ తలుపు తియ్యలేదు.

"అయ్యా అయ్యా ! బాబోరే ! బాబూ ఒరే !", అని కేకలు వేసేడు పైడ్రాజు.

తలుపు గట్టిగా తడుతున్నాడు దొంగ తండ్రి.

పైడ్రాజుకి ఏం చెయ్యడానికీ పాలుపోలేదు. రెండు నిమిషాలు పోనిచ్చి గేటు వైపు పరిగెట్టేడు. అది తాళం వేసేసి ఉంది.

ఇంకా గేటు గెంతలేదు పైడ్రాజు. అంతలోనే ఎవరో గబగబా వచ్చి,

"ఎవరు నువ్వు ? ? ?" అని గద్దించి అడిగేరు. వాడు ఎత్తుగా భయంకతంగా ఆ మసక చీకట్లో భీముడి నీడలా ఉన్నాడు.

"మా అయ్య లోప లున్నాడు !" అన్నాడు పైడ్రాజు.

"ఎవర్నువ్వు ? నీ అయ్యెవడు ? లోపల దొంగ దూరేడు ! వాడా నీ అయ్య ? రా ! లోపలికి రారా రాస్కెల్ ! మీ అయ్యెవడు ? పోలీసులకి చూపిద్దువు గాని, రా ! ఫోన్ చేసేం; అన్నాడు నీడ భీముడు.

పైడ్రాజుని అంతవరకూ చుట్టిపట్టుకున్న భయం, ఎందువల్లనో వెంటనే విడిపోయి మాయమయింది. ఆ భయానికి బదులు అంతులేని నిరాశ అతని చూట్టూ అలముకొని అతణ్ని ముంచేసి కుంగదీసింది.

బెదిరించినంత మాత్రాన ఇనప్పెట్టెలు భయపడవని అతనికి తెలిసిపోయింది. గుండెమీద ఇనప్పెట్టె ఎత్తేస్తే అసహాయంగా ఉంది

పోడం తప్ప తనేమీ చెయ్యలేనని అతనికి తెలిసిపోయింది. నీరసంగా అక్కణ్నించి నడుచుకు వెళ్ళిపోయే దతను వెనక్కి.

ఆ షావుకారు తన దొంగతండ్రి మీద ఏదో ఒక అబద్ధపు చోరీ కేసు తగిలిస్తాడనుకున్నాడు పైడ్రాజు. కాని,

తీరా మోసి కోర్టుకి వెళ్లేసరికి ఆ తండ్రిమీద పెట్టిన కేసు ఖూనీ కేసన్నారు.

దిగ్భ్రమ చెందిపోయేడు పైడ్రాజు. ఆ కేసు అతణ్ని కుతకుత లాడించింది.

ఆ తరవాత, వాయిదా వాయిదాకీ కోర్టుకి వెళ్ళడమే కాకుండా, జెయిల్లో అర్జీపెట్టి తండ్రితో చాలాసార్లు మాట్లాడేడు పైడ్రాజు.

"తలుపు తెరగానే" దొంగతండ్రి లోనికి గదిలోకి వెళ్ళేట్ట.

అవును.

లోపల "నైటు" లేదట,

అవును. తొలిసారి ఎలిగింది కాని నువ్వెళ్లేసరికి నేదు; ఒవులో ఆర్పేసినారు.

"ఎల్లీ ఎల్లగానే ఒవులోకాని– దెయ్యం వజ్జెప్పి దడుసుకున్నాను– ఆడు గెదిలోంచి బైట కెల్లిపోయి గొళ్లెం వెట్టేసినాడు"

అవును పైడ్రాజు చూసినాడు.

"నోపల సిమ్మసీకటిగుందోరే పైడ్రాజు! ఏట్రా భగవంతుడా అజ్జెప్పి బెంగడిపోన్ను. నైటు ఏద్దారంటే తొలిసారి మీట అవుపణ్నేదు, అవుపన్నాక ఎలిగిద్దారంటే సేతులెల్లినాయికావు. తలుపులు బాదినాను. తీసినారుగాదు. కుసింత సేపొయ్నాక, గెదంతా కలయజూసినాను. కలయజూస్తె, గుండాగి పోనాదిరా పైడ్రాజు! సెట్టుమాను ఇరిగి పడున్నట్టు ఇనప్పెట్టికాడ పడున్నాడు! వాకారవేం అవుపిస్తంది!

పప్పుడు మొండిదయిర్యం జేయిస్సి మీట నొక్కినాను. నొక్కి సైకెలి గించి జూస్తే ఇంకేటుంది ? ! చావుకారు సచ్చిపడున్నాడు. ఎన్నుమీద కత్తి పొడుసుకునుంది! నెత్తురు సిమ్ముతుంది! అది సూస్తంటే నాకు గింయ్ మని బుర్ర గీరెట్టిపోనాది! పైడితల్లెమ్మకి దణ్ణవెట్టుకొని అలా సతికిలబడిపోన్ను ! అంతల ఒచ్చి పణ్ణాయి ఎర్రటోపీలు ! అదీ చంగతి!"

పెద్ద కోర్టులో కేసు విచారణకి వచ్చినప్పుడు పైడ్రాజు కోర్టుకి వెళ్ళి, ప్రాసిక్యూషన్ కథనం పూర్తయిన తరవాత తండ్రి తరఫున తను డిఫెన్స్ పలికేడు,

కోర్టు హాల్లోకి వెళ్ళడం, కోర్టు వ్యవహారం అంతా దగ్గర్నుంచి చూడ్డం అదే ప్రథమం పైడ్రాజుకి.

"ఏటి ఈ ఓసన?" అనుకున్నాడు.

అది కోర్టు వాసనని అతనికి తెలియదు.

"మద్దినాలపేళ దీపాలెట్టుకున్నారేటి?"

ఆ గదులు కట్టినప్పుడే చీకటిగా కడతారని అతనికి తెలియదు.

"ఆలీబాబా చినీమాలో దొంగల్లా ఇంతమందున్నారు! ఈళ్లె వుళ్లు?" అని ప్రశ్నించుకున్నాడు

"ఓహో! ఈళ్లే కావోలు పీడర్లు !" అని సమాధానం చెప్పుకున్నాడు.

"పీడర్ల నీడర్లా ఉన్నాడు గద్దెమీద !" అని జడ్జీని గుర్తించుకున్నాడు,

"ఓడ పక్క తవ్వోడనాగ గద్దెకింద కుర్సీలో ఆడెవడు?"

"కోరుటు గుమాస్త కావాల,"

"ఇల్లా ఇల్లా అంటున్నాడు ఈడెవడు?"

కోర్టు బంట్రోతు. "అచ్చంగ జెయిలు వోర్డరుగాళ్ళా ఉన్నాడు!"
"పెట్టెల ఎక్కమంటున్నాడే!"
అవును. అక్కణ్ణించే అబద్ధాలు పలకాలి.
"ఏటో సెప్పమంటున్నాడు! ఏంటది?"
దేముడి యెదట ప్రమాణం చెయ్యమంటున్నాడు. అదీ అది.

ప్రమాణం చేసి, జడ్జీవైపు తేరిపారి చూసి, "ఇలాటోణ్ణి ఎక్కడో చూసినానే!" అనుకున్నాడు పైడ్రాజు. అప్పుడతనికి ఇనప్పెట్టె ముందు పరమ వేదాంతిలా నిల్చున్న "చావుకారు" గుర్తుకు వచ్చేడు. "చచ్చిన చావుకారికి అచ్చంగ అన్నదమ్ముళ్ళా ఉన్నాడు!" అనిపించింది పైడ్రాజుకి న్యాయాధిపతిని చూసి.

పైడ్రాజుకి ఆ ముక్కవాసన గదిలో చలిచలిగా భయం వేసింది. అడవుల్లోనూ, పుట్టల్లోనూ భయమేస్తుందనీ, దయలేనిచోట మనిషికి చలివేస్తుందనీ పైడ్రాజుకి తెలియదు. ఆ కోర్టు హాలంతా అతనికి ఓ ఇనప్పెట్టెలా తోచింది. ఒక గుహలా కనిపించింది.

చూసినది చూసినట్టుగా నిజమే చెప్పినప్పటికీ, భయంవల్ల వడ వడ వణుకుతూ సాక్ష్యం చెప్పేడు పైడ్రాజు. అందుచేత అక్కడ ఆ సమయంలో నిజానికి నిజంగా జ్వరం పట్టుకున్నట్టయింది.

పైడ్రాజు సాక్ష్యం పలుకుతూంటే జడ్జీగారు చిరునవ్వు నవ్వేరు. "ఏమిరా? చెప్పరా! రెండు వెయ్యలు కావాల్రా?" అంటూ వెటకారంగా విరిసిన "చావుకారు నవ్వు" గుర్తుకి వచ్చింది పైడ్రాజుకి.

జడ్జీగారు పైడ్రాజు పలికిన సాక్ష్యం విని కోర్టులో మందహాసం చేసేరు కాని, జడ్జిమెంటులో మాత్రం ఆ సాక్ష్యాన్ని పగలబడి నవ్వి పారేసి, మేకలమూకని పులి చెండాడినట్టె చెండాడి తునాతునకలు చేసి పారేసేరు. వారి జడ్జిమెంటు "ఏబుల్"గానూ ఉంది, "లెర్నెడ్"గానూ

ఉంది. పైపెచ్చు "విట్ అన్డ్ హ్యూమర్"తో "స్పార్క్లింగ్"గానూ ఉంది. న్యాయంగా ఉందా లేదా అంటే అది భగవంతుడికి తెలియాలి; నిజానిజాలు మానవులకెలా తెలుస్తాయి మీరే చెప్పండి.

జడ్జీగారు చాలా విట్టీగానూ విపులంగానూ రాసిన జడ్జిమెంటు కొసవరకూ అలా మెరుపు తీగలా సాగి, ఆఖర్న దొంగతండ్రికి ఉరి శిక్ష విధిస్తూ భగ్గున ముగిసింది.

పుట్టగానే ఏడ్చేడు, వాతలు వేసినన్నాడు ఏడ్చేడు, తల్లిని కొట్టిన నాడూ ఆమె చనిపోయిననాడూ ఏడ్చేడు, ఆ తీర్పు రోజున ఏడ్చేడు, ఆ తండ్రిని ఉరితీసిన రోజున ఏడ్చేడు— మరింక జీవితంలో ఏడవకూడ దని భీకరంగా నిశ్చయించుకున్నాడు పైడ్రాజు.

న్యాయస్థానపు టనుభవంతో చాలా అనుభవాలు పూర్తయేయి పైడ్రాజుకి.

దొంగ తండ్రిని ఉరితీసిన మర్నాడు ఊళ్ళో ఏదో పెద్ద సంబ రం అవుతోంది. ఊరంతా హడావిడిగా బాజాల్తో, వేషాల్తో, జనం చేసే గొడవతో అల్లరితో సారాతో సరసాలతో పువ్వులతో పులకరింపులతో కోలాహలంగా ఉంది.

అంతటిమధ్యా వారందరిమధ్యా వంటరిగా అలా అలా తిరుగుతూ ఆలోచించ సాగేడు పైడ్రాజు.

అతని కళ్ళముందు —

ముష్టితల్లి, ముష్టితండ్రి, దొంగతల్లి, వాళ్ళవైచ్యం, వాళ్ళ దైన్యం, వారి భయం, వారి అమాయకత్వం, వారి అసహాయత్వం —

అన్నీ సూచించే దృశ్యాలన్నీ అతని కళ్ళముందు కదలాడేయి.

అలాగే అతని కళ్ళముందు —

పోలీసులు, ప్లీడర్లు, కోర్టులు, జెయిళ్ళు, 'చాపుకార్లు', వాళ్ళ మేడలు, వాళ్ళ కార్లు, వాళ్ళ వాళ్ళ గజలక్ష్ములు, వాళ్ళ ప్రమాణాలు, వాళ్ళ ధైర్యాలు, వాళ్ళ సాహసాలు, వాళ్ళ భయాలు, వాళ్ళ శత్రుత్వాలు, వాళ్ళ పెట్టెలు, వాళ్ళ నోట్లు, వాళ్ళ మాయలు, వాళ్ళ దొంగతనాలు ___

అవన్నీ సూచించే దృశ్యాలు కూడా అతని కళ్ళ ముందు కదలాడేయి.

చిన్నా పెద్దా తేడాతప్ప ఆ రెండు జీవితాలకీ అట్టే తేడా కనిపించలేదు పైడ్రాజుకి. దరిద్ర ప్రయాచకులూ దరిద్రపు దొంగలూ ఉన్నట్టే గొప్పయాచకులూ గొప్ప దొంగలూ ఉంటా రనిపించిం దతనికి.

ఆ జీవితాల దృశ్యాలు కదలి కదలి గిర్రున తిరిగి తిరిగి ఆఖర్న అవన్నీ ఒకటేగా అతనికి కనిపించేయి.

అతని కళ్ళముందు. అదే విధంగా, మరొక జీవితపు దృశ్యాలు కూడా కదలాడేయి. దాని అంచున నిలబడి అందులోంచి తిండి తీసుకోవడం తప్ప ఆ జీవితంలో అతనికి మరే సంబంధమూ లేదు. కాని, ఆ జీవితం అనునిత్యం, అతని పక్కనే ఉంది. ఆ యేట్లోంచే అందరికీ నీళ్ళొస్తాయి. కొందరు ఒడ్డుదాకా పోయి చెంబుల్తో తెచ్చుకుంటారు. ఇంకొందరు ఎక్కడో దూరంగా ఉండే, అక్కడికి, తమ దగ్గిరకి గొట్టాలద్వారా మేడలమీదికి తెప్పించుకుంటారు. రోజూ ప్రతిరోజూ అతను చూసే చచ్చుడి పేటలు, చాకలి వీధులు, కూలివాడలు, కొండలంత రాళ్ళ తవ్వకాలు, పారలతో ఇసకతీతలు, ఎద్దులతో పాటు దుక్కులు, వర్షధారల్లో ఉభాలు, ఎండలో చెమటలు, ఇనపరాళ్ళ మోతలు ___

ఆ దృశ్యాలు ఎన్నో ఎన్నెన్నో అతనికి కనిపించి అవన్నీ గిర్రున తిరిగి అతని కంటికి ఒకటిగా కనిపించేయి.

ఎండలో చెమటలు,

గజలక్ష్మి బొమ్మలు.

ఆ రెండింటి గురించీ అతను ఆ విధంగా ఆలోచిస్తుండగా అకస్మాత్తుగా అతని కంటిముందు గొళ్ళాల్తో తలుపులు మూసిన రెండు గదులు కనిపించేయి. గొళ్ళాలు తీసి తలుపులు తెరిస్తే!

ఆ రెండింటిలోనూ—ఒక గది :

మట్టిగోడలు, సున్నపు చుక్కలు, కొన్ని వట్టికుండల మధ్య నీటి కుండ, రెండు కంచు గిన్నెలు, ఒక నులక మంచం, వడిలిపోయిన ముసలి బొంత, వెర్రి గేదె లాంటి నల్లటిపెట్టె, ఓ మూల కొన్ని పిడకలు, గోడని ఓ వెర్రమ్మవారి బొమ్మ—అంతకి మించి ఆ గదిలో ఇంకేమీ లేవు.

ఇంకొక గది :

పొంగిన పాలవెలుగులో మెరిసే కోవాగోడలు, సిల్కు తెరలు, నల్లకోజాల మంచాలు, పట్టు తివాసీలు, పైన పంకాలు, పాతుకుపోయి మరెక్కడికీ కదలని (చినీమాలో అల్లావుద్దీన్‌గాడి చిమ్నీలాంటి) ఇనప పెట్టెలు, "లెగిసిపోకుండా" మేకు లేసి దిగగొట్టిన గజలక్ష్మి బొమ్మలు—ఆ గదిలో సంపద అంతా ఉంది.

ఆ రెండు గదులూ చిత్రంగా పెద్దసైజు ఫోటోల్లా ఆ రాత్రి పైడ్రాజు కళ్ళముందు నిలబడ్డాయి. వాటిని సరిపోల్చి చూసుకొంటే—

ఓ గదినిండా నీడలే; రెండో గదినిండా పాలవెలుగులే; ఓ గదిలో మూలుగులే; రెండో గదిలో నవ్వులే. అందులో మనిషికష్టం కళ్ళు కప్పుకొని చీకటిగా ఏడుస్తోంది; ఈ గదిలో మనిషి దొంగతనం

వెలుగుతోంది; ఆ గదిలో చెమటల నీడలు నిర్భాగ్యంగా పరుచు కున్నాయి; మనిషి చేసే దొంగతనం ఈ గదిలో పంచరంగుల్లో ప్రజ్వ రిల్లుతోంది. ఆ గదిలో "నిర్భాగ్యపు నీడలు;" ఈ గదిలో "దొంగ తనపు రంగులు."

దొంగోడైనా, ముష్టోడైనా కష్టపడీ వోడిమీద బతకాల్సిందే! కాని, ఏటవుద్దంటే: అయ్యలాటి సిన్నదొంగలు సితికిపోతే, చావు కార్లాటి పెద్దదొంగలు పెరుగుతారు. ఎలకలాటి అమ్మని సితగ్గొట్టి సంపేసిన జనం పెద్దపులు ల్లాటోళ్ళని మాత్తరం ఇచ్చలయిడిగ ఒగ్గే స్తారు. కూలోళ్ళా కష్టపడ్డవాఁ? సిన్నదొంగలా సితికిపోడవాఁ? నేక పోతే, దోసుకు తిని పెద్దపులి పెరిగినట్టు పెరగడవాఁ?

అని దీర్ఘంగా ఆలోచించి నప్పటికీ ఎంతో దీర్ఘంగా ఆలోచించ నవసరం లేక పోయింది పైడ్రాజుకి. కనిపించే ఆ రెండు గదుల్లోనూ తనకి బొంతపరచిన నులక మంచం కావాలో లేక మెత్తటి పరుప్పరి చిన పందిరిమంచం కావాలో తేల్చుకోడం అతనికి అట్టేకష్టమనిపించ లేదు. పెద్దల్లా దోచుకు తినడం బెస్టు అనే నిశ్చయానికి అతను రాడా నికి అట్టేసేపు పట్టలేదు.

దోచుకు తినడం బెస్టు!!—

అనే టటువంటి పరమ ఘోరమైన నిశ్చయానికి ఏ మానవు డైనా వచ్చి సాహసంతో రంగంలోకి ఉరికి, మెలకువతో వ్యవహ రించి, పట్టుదలతో పనిచేస్తే:!—వాణ్ణి మరింక ఆపడం చాలా కష్టం, వాడు చాలాదూరం వెళ్తాడు, చాలా పైకి వెళ్తాడు, పాపభీతి, దైవభీతి, సంఘభీతి, ఏభీతి ఉండదు వాడికి. వాడు పెద్దపులిలా ఉంటూనే పరమ ధర్మ రాజులా కనిపించగలడు. తన బాగుకోసం వాడి తల్లిగొంతు నొక్కగలడు, తండ్రివెన్ను పొడవగలడు, తమ్ముడి నెత్తురు తాగ్గలడు.

లొంగినవాళ్ళని వాడు అణుస్తాడు, లొంగని వాళ్ళలో కలుస్తాడు. అవసరం తీరిపోయాక నిపురంతా కప్పేసుకుంటాడు. దైవం, ధర్మం, అర్థం, కామం, సంఘం, స్వర్గం అన్నీ తనకోసమే ఉన్నాయి కాని తనెవరికోసమూ ఉండనంటాడు. చెదలా తినేస్తాడు, పులిలా విరుచుకు పడతాడు. దేశాన్ని అమ్ముతాడు, ధర్మాన్ని చంపుతాడు. వాడు చాలా దూరం వెళ్తాడు.

పైడ్రాజు, ఆ తరవాత, ఆ విధంగా చాలా మెట్లు పైకెక్కి చాలా దూరం వెళ్ళేడు.

మొదటిమెట్టు ఎక్కడానికి ముందు అతను ఆ వూర్నించి మరో వూరికి మకాం మార్చి, ఆ కొత్తవూర్లో ఓరిక్షా ఒకటి రోజువారీ అద్దెకి తీసుకొని, బేరాలకి రిక్షా తొక్కడం ప్రారంభించేడు.

రిక్షా తొక్కుతూ అతను తీవ్రాతితీవ్రంగా ఆలోచిస్తూండేవాడు.

నెలరోజు లయింది, నెలరోజుల్లోనూ అతను నాలుగైదుసార్లు స్టేట్ బ్యాంకికి బేరాలు కట్టేడు. బ్యాంక్ బిల్డింగు చాలా కొత్తది బంగారు కాసులాగా నూర్రూపాయల కొత్తనోట్లాగా అది చూడ్డానికి బరువుగానూ మనోహరంగానూ కూడా ఉంది.

"ఏటది ?" అని ఒకర్నడిగేడు పైడ్రాజు.

"పెద్దోళ్ళక్కడ డబ్బు దాస్తారు. కర్సుకి కావల్సొచ్చినప్పుడు ఎల్లి సెక్కులిచ్చి తెచ్చుకుంటారు," అని పైడ్రాజు తెల్సుకున్నాడు. అప్పటినుంచీ అతను స్టేట్‌బాంక్‌ని దృష్టిలో ఉంచుకున్నాడు. అక్కడికి బేరాలు కట్టినప్పటికీ, ఆ తాను వాళ్ళ ముఖపరిచయం లేకుండా ఉండడానికిగ్గాను, అతను బాంక్‌నుంచి మాత్రం ఎప్పుడో తప్ప బేరాలు కట్టేవాడు కాడు.

ఓరోజున ––

హోరున వర్షం పడుతోంది. రెండు రోజుల్నించీ కూడా అలానే పడుతోంది. ఆరోజున అంతకు ముందుకంటె ఎక్కువయింది. చినుక్కీ చినుక్కీ మధ్య ఈగ కాదు, దోమకాదు, సూదికాదు, గాలి కూడా చొరడానికి వీల్లేకుండా నిల్చి కురుస్తోంది వర్షం. మధాహ్నం సరిగ్గా ఒంటిగంటే అయినప్పటికీ, మబ్బువల్ల. అది సాయంకాలం సరిగ్గా ఏడుగంటలయినట్టు చాలా చీకటిగా ఉంది. బాంక్ మేడనుంచి కిందికి గొట్టాలద్వారా ఘోరున దిగే నీటిధారలు (మీ మీ అభిరుచులను బట్టి) కరిగించిన ముత్యాలధారల్లాగో, లేక కష్టించే కూలివాళ్ళ కన్నీటి ధారల్లాగో కిందికి దిగుతున్నాయి.

ఠంగున ఒంటిగంట కొట్టిన శబ్దం వర్షపు హోరులో కలిసి పోయింది. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. బాంక్ ముందు నిల్చున్న అయిదు రిక్షాల్లోనూ నాలుగు బేరాలెక్కించుకొని వెళ్ళిపోయేయి. అయిదో రిక్షా పైడ్రాజుది. అది గూడు ఎత్తుకొని, తెరలు దించుకొని శవపేటికలా నిలబడింది. వర్షానికి తడియకుండా రిక్షాలో కూర్చొని తెరమీంచి సన్నని దారి చేసుకొని బాంక్వైపు తీక్ష్ణంగా చూస్తున్నాడు పైడ్రాజు. పైనుంచి ఆ కళ్ళే చూస్తే అవి పుట్టలో పాము కళ్ళలాగో, పొదలోని పులి కళ్ళలాగో కనిపిస్తాయి.

అంతలో, బాంక్ వరండాలోకి, నోట్లు లెక్కపెట్టుకొంటూ ఓ ముసలాయన వచ్చేడు— తెల్ల చొక్కా, జరీ అంచు తెల్ల పంచె, బరం పురం పట్టు కండువా, బోడిగుండు, చంకన గొడుగు— అన్నీ కని పెట్టేడు పైడ్రాజు. కనిపెట్టి, రిక్షాలోంచి బైటకి వచ్చి సిద్ధంగా నిల్చు న్నాడు. అతని తలమీద ఇనపరేకు టోపీ ఒకటుంది. టోపీకింద చీకట్లో పైడ్రాజు ముఖం సరిగా కనిపించడంలేదు.

ముసలాయన తన చేతిలోని నోట్లు ఇంకా లెఖ్కపెడుతూనే

ఉన్నాడు. ఎన్నున్నాయో కాని చా లా నే అయుండాలి. చిట్టచివరికి, లెక్కంతా పూర్తయిన తరవాత, ఆ నోట్లన్నీ చొక్కాకింది బనియన్ జేబులో భద్రంగా పెట్టి, ఆ ముసలాయన రోడ్డువైపు తలెత్తి చూ సి ''ఏయ్! రిక్షా!" అని కేకవేస్తూ, చేత్తో సంజ్ఞ చేసేడు. పైడ్రాజుకి కే క వినిపించలేదు, సంజ్ఞ కనిపించింది.

వెంటనే, పైడ్రాజు గుండెలు పట్టపగ్గాలేకుండా కొట్టుకున్నాయి. వాటిని కంట్రోలు చేసుకొని, గంభీరంగానూ వినయంగానూ ము స లాయన దగ్గరకి రిక్షా తీసుకు వెళ్ళేడతను. మూడున్నర మైళ్ళ దూరం వెళ్ళడానికి ముప్పావలాకి బేరమాడి, తొందర తొందరగా రిక్షాలోకి దూకి కూర్చున్నాడు ముసలాయన. రిక్షా రివ్వున కదిలింది.

ముసలి పాసెంజర్ని ఎక్కడికి తీసుకు వెళ్ళాలో ముందే నిర్ణయించుకున్నాడు పైడ్రాజు. రిక్షాని రెండు మైళ్ళు పోనిచ్చి, అక్కడ కుడివైపుకి బదులు ఎడమవైపుకి రిక్షా మళ్ళిస్తూ, లోపల ముసలాయన్తో ''బాబూ! ఒరసానికి ఆ రోడ్డు ఉప్పుడుప్పుడే గాతలడిపోనాది. సుట్టు తిప్పి తీసికెల్లాల! కష్టం ఆలోసిచ్చి మరో బేడ డబ్బులు పారేయాలి" అని అరిచి చెప్పేడు.

''ఎటు వెళ్ళినా వేగిరం వెళ్ళనీరా! మరో కాన్డబ్బు ఇస్తాలే!" అన్నాడు ముసలాయన.

రిక్షాని రయ్యిమని ఆరు ఫర్లాంగుల దూరం పోనిచ్చి అక్కడ రిక్షా ఆపి దిగేడు పైడ్రాజు. అ క్క డ చీకటిగానూ, ఏకాంతంగానూ వుంది.

''ఏరా ఏం ఆపేవు?"

"సెయిను జారిపోనాది బాబూ" అ ం టూ నే ఒకవైపు తెర ఎత్తేడు పైడ్రాజు. ఆ సమయంలో అతని కళ్ళు రెయిలు పట్టాలదగ్గర

దేంజరు బల్బుల్లా ఎర్రగా వెలిగాయి. అతని చేతులు, పరమ భయంక రంగా, యమపాశాల్లా, ప్రాణం లేని పిశాచ యంత్ర హస్తాల్లా లోనికి వెళ్ళేయి.

ముసలాయన నిశ్శబ్దంగా ఒరిగిపోయేడు.

ఆ తరవాత, తెర సరిచేసి, తాడుతో గట్టిగా కట్టి, ఊరవతల మూడు మైళ్ళ దూరానికి రిక్షా పోనిచ్చేడు పైడ్రాజు. అక్కడ ట్రంకు రోడ్డు పక్క మర్రిచెట్టొకటుంది. ఆ మర్రిచెట్టు కిందినుంచి పక్కగా పోయే కాలిబాట అక్కడికి ఆరుమైళ్ళ దూరంలో ఉన్న అమ్మవారి గుడి దాకా పోతోంది. ఆ బాటకి రెండు పక్కలా దట్టంగా రెల్లుగడ్డి బలిసివుంది. ఒక పక్క రెల్లుగడ్డి అవతల దొంగ యేరొకటుంది. అది ఆ సమయంలో గోదావరి కంటె ఎక్కువ జోరుగా ప్రవహిస్తోంది. ఆ దొంగ యేటి ప్రవాహంలో ఆ ముసలాయన శవం మునిగి కొట్టుకు పోయి, ఎప్పుడు ఎక్కడ ఎవరికి ఏ వికృతాకారంలో కనిపించిందో కనిపించలేదో ఏమయిందో ఏమిటో పైడ్రాజుకి తెలియనే తెలియదు. అతను ఆ సొమ్ము (రెండొందల పదులు) సంగ్రహించుకొని, తిన్నగా ఊళ్ళోకి వచ్చేసేడు.

ఆ రోజున పైడ్రాజుకి ఇరవై ఒకటో సంవత్సరం వెళ్ళి ఆ తర వాత మెట్టు ఎక్కేడతను.

ఆ రోజు తరవాత ఆర్నెల్లపాటు మామూలుగా రిక్షా తొక్కు కొంటూనే జీవించేడు పైడ్రాజు. ఆర్నెల్లూ కూడా తెగ కష్టపడి, భోజనం తగ్గించి, తాగుడు మానేసి, టీ తాగడం కూడా తగ్గించి, అందరికీ తెలిసే ట్టుగా రోజుకొక రూపాయి చొప్పున నిలవ్వేసి చాలా కష్టజీవిగా కాలం గడిపేడు పైడ్రాజు. మధ్య, వరసగా చీట్లుకట్టి, ఆ విధంగా వక్క సారిగా వచ్చిన డబ్బు కూడా అనవసరంగా ఖర్చు పెట్టకుండా కూడ బెట్టేడతను.

ఆర్నెల్లయేసరికి దగ్గిర దగ్గిర మూడు వందలు నిల్వ చూపించేడు పైడ్రాజు. అతడి ఊర్జితానికి అతణ్ని అంతా మెచ్చుకున్నారు. రిక్షాల సంఘంలో అతను ఛోటా నాయకుడయేడు. సంఘాలూ వాటివల్ల వాటిలో కొందరికుండే లాభాలూ అన్నీ గ్రహించేడు పైడ్రాజు. అతని పలుకుబడి దాన్తో పెరిగింది. ఓ తాపీమేస్త్రీ అతనికి రెండు వందలు అప్పు కూడా ఇచ్చేడు. ఆ డబ్బుతో, వెంటనే, ఓ కిల్లీ బడ్డీ కొన్నాడు పైడ్రాజు. రిక్షాల సంఘంలో అతను కొంత డబ్బు స్వంతానికి వాడుకున్నాడని అపవాదొకటి బయల్దేరింది. కాని అందుకతను భయపడలేదు. అపవాదుగాళ్ళని లక్ష్యపెట్టలేదు. అతను రిక్షా తొక్కడమే మానుకున్నాడు.

కిల్లీ దుకాణం ఒక ఏడాదిపాటు నడిపించేక, అప్పుడు ముసలాయన దగ్గర తీసుకున్న నోట్లు కొద్దికొద్దిగా ఉపయోగించ నారంభించేడు పైడ్రాజు. ఊరవతల కొండవార, దొంగయేటి వడ్డున, కొత్తగా పెద్ద ఫ్యాక్టరీ పెడతారని అతనికి "ఉప్పుఅందింది." వెంటనే అక్కడొక చిన్న జాగా క్రయం చేసుకున్నాడతను. క్రయంధనంలో కొంత మాత్రమే ముందుగా ఇచ్చి, మిగతా క్రయధనానికి ఆ జాగాని ఆ అమ్మినవారికే తనఖాపెట్టి ఆ జాగా ఆవిధంగా కొన్నాడతను. జాగా మొత్తం ఖరీదు ఎనిమిది వందలు మాత్రమే.

ఆ జాగా కొన్న ఆర్నెల్లకి ఫ్యాక్టరీపని ప్రారంభం అయింది. వెంటనే పైడ్రాజు అక్కడొక టీ కొట్టూ కిల్లీ బడ్డీ రెండూపెట్టి, ఆర్నెల్లలో ఆ టీ కొట్టునే కాఫీ ఫలహార శాలగా మార్చేడు.

ఆ కాఫీక్లబ్బు చాలా రద్దీగా ఉండేది. అక్కడికి, ఆ ఫ్యాక్టరీ నిర్మాణంలో పనిచేసే కూలీలూ, తాపీమేస్త్రీలూ. కూలిగ్యాంగుల నాయకురాళ్ళూ వస్తూండేవారు.

అందానికి ఆకర్షణ ఉంది. ఆకర్షణ అంటే అదొక శక్తి. అందం ఒక శక్తనీ, దాన్ని మానవుడు స్వలాభానికి ఉపయోగించుకోవచ్చనీ తెలియకపోయినా ఉపయోగించుకోవడం మాత్రం నిత్యం చాలాచోట్ల జరుగుతూంటుంది. పెద్దల సంఘంలో "పర్సనాలిటీ"కి ఎంతకంత ప్రాముఖ్యం ఉందో తెలియనప్పటికీ తన చక్కని పర్సనాలిటీని పైడ్రాజు పూరాగా తన లాభానికి ఉపయోగించుకున్నాడు. ఒక ముప్ఫయ్యేళ్ళ మేస్త్రమ్మకి ముప్ఫయితులాల బంగారం ఉంది; ఉక్కుని మూడుముక్కలు చేయగల మొగుడున్నాడు. కాని జీవితంలో తనకి నచ్చిన ఇద్దరు సినీమా హీరోల్లోనూ ఒక్కరైనా ఒక్కసారైనా తనకి లేనందుకు ఆమె లోలోపల చాలా యాతనపడుతూ తిరుగుతోంది. ఆమె కంటికి పైడ్రాజు, తన ఇద్దరు హీరోలనీ కలగా పులగంచేసి మనోహరంగా తయారుచేసిన మూడో హీరోలా కనిపించేడు. అతని పర్సనాలిటీకి ఆమె పరవశురాలై పోయింది. ఉక్కుమగణ్ని దూరంచేసి ముప్ఫయి తులాల బంగారాన్ని దగ్గరకి తెచ్చుకొందికి పైడ్రాజు పెద్దగా శ్రమపడవలసిన అవసరమే లేకపోయింది. మోజుకొద్దీ ఆ మేస్త్రమ్మ కొన్నాళ్ళపాటు అతనితో ఉండిపోయింది, చివరిదాకా ఆమె అతన్తోనే ఉండిపోను. కాని, ఏడాది పోనిచ్చి, ఆమెబంగారం అంతా అపహరించి ఆమెని తన్ని తగిలేసేడు పైడ్రాజు.

ఇంకో విధంగా కూడా కూలి గ్యాంగుల మేస్త్రమ్మ స్నేహం పైడ్రాజుకి చాలా బాగా పనికి వచ్చింది, ఆమె స్నేహంతో అతను పరమపండితు డయ్యేడు. ఇసక తీత కంట్రాక్టు వెయ్యిరూపాయలకి పాటపాడి, పదిమంది కూలీలకి రోజుకి మనిషికి రూపాయి కూలిచ్చి, వాళ్ళచేత రోజుకి రెండు రూపాయిల పని చేయిస్తే ఎంత లాభం వుంటుందో మేస్త్రమ్మ పరిచయం వల్ల గ్రహించాడు పైడ్రాజు.

రూపాయికూలికి, కూలోడు రొండ్రూపాయిల పన్జేస్తే కంట్రాక్టరుకి అదేలాభం రూపాయి కూలికి దమ్మిడీ పని తగ్గిపోయినా కంట్రాక్టోడికి మదుపులు కిట్టవు. కూలోణ్ని గుర్రంలా పరిగెట్టించి గాడిదలా తోలి పన్జేయించకపోతె కంట్రాక్టు కుదేలే !"

ఆ పాఠం ఎప్పటికీ మర్చిపోజాలడు పైడ్రాజు.

పైడ్రాజు ఇప్పుడెక్కడున్నాడు !

చాలా దూరంలో ఉన్నాడు.

అయిదేళ్ళ క్రితం అతను చాలా చిన్నవాడు కాకపోయినా పెద్దవాడు మాత్రం కాదు. ఇప్పుడతను గవర్నమెంటుకి అప్పివ్వగలిగిన కంట్రాక్టరు. ఇప్పుడతను లక్ష రూపాయల పి. డబ్ల్యు. డి. కంట్రాక్టు మీద, లేకపోతే రెండు లక్షల సి. పి. డబ్ల్యు. డి. కాంట్రాక్టుమీద వేలి ముద్ర వేస్తాడు, అతన్లో అదొకచాలా గొప్ప పాయింటు—నిశాని పద్దుగాడు. కాని చూసేరా ! స్వయం ప్రతిభతో ఎంత పెద్దవా డయేడు ! అది పూర్వజన్మ సుకృతం !" అని పురప్రముఖు లతని గురించి ముచ్చటగా చెప్పుకుంటారు. వేద పండితులు అతడి దేవభక్తి గురించీ దాతృత్వం గురించీ మెచ్చుకొని అతణ్ని ఒక్కొక్కరూ వేయినోళ్ళతో శ్లాఘిస్తారు. అతను కో అంటే కొన్ని వందల మంది లాయర్లు అతని కాళ్ళమీద పడతారు. కాళ్ళూచేతులూ లేక కదల్లేని లాయర్లు అతని పిలుపుని అందుకొని వెళ్ళజాలకపోయినందుకు చాల విలపిస్తారు. ప్రస్తుతం రెండు పొలిటికల్ పార్టీలవారూ, ఆరుగురు మ్యున్సిపల్ కౌన్సిలర్లూ, నాలుగు నాటక సమాజాలవారూ మూడు కరుణ సమాజాల పార్టీలవారూ, అయిదు కారెమ్స్ క్లబ్బులూ పైడ్రాజుగారి సపోర్టుకోసం ప్రాధేయపడుతూ కాళ్ళు అరిగేలా తిరగడం జరుగుతోంది.

పైడ్రాజుగారి ఫ్యాక్టరీ గేటుకి ఎదురుగా మేడొకటుంది. అది కాక, "అల్లప్పుడు మందుల షావుకార్నొకణ్ని చూసినప్పుడు ఆ బంగళా

నతడు జ్ఞాపకంఉంచుకున్నాడు; ఆ పక్కనే దానికి దక్షిణంగా అలాటిదే పెద్ద బంగళా ఒకటుంది. పైడ్రాజుకి గజలక్షి కళ ఉట్టిపడుతూండే చిక్కటి పాలమీగడవంటి భార్య వుంది; వారికి చక్కని పనస తొన లాంటి అయిదేళ్ళ కొడుకున్నాడు. కొత్తింట్లో పైడ్రాజుబాబు ఇనప్పెట్టె చూశారా ? కొత్తగా హైద్రాబాద్‌నించి రప్పించేరు. చూడ్డానికి కాణీ టిక్కెట్టు పెడితే నెలకి కనీసం వెయ్యిరూపాయ లొస్తాయన్న మాట ! అంత చక్కటి పెట్టె ! బలే ఇనప్పెట్టె !

పైడ్రాజుగారు ఇప్పుడు భూమ్మీద నడవరు. దగ్గరైతే, కారు మీద ఊరేగుతారు; దూరం అయితే గాల్లో ఎగురుతారు. "గొప్ప దరిజా అయిన మనిసి ! ఎంత ద రి జా మనిసైనా, కూలోళ్ళంటే మా త్త రం బా బు కి గొ ప్ప క ని క ర ం ! పనగ్గిర కచ్చితం— కరాకండిగ సెవట్లు కక్కించి రూపాయికిరొండ్రూపాయిలపనిదగ్గిరుండి మరీ జేయిస్తాడు, కాని, ఒళ్ళొంచి కష్టపడి నమ్మకంగా పన్జేసి దగ్గిర కెల్లి "బాబూ ! పైడ్రాజుబాబు !" అని కేకేస్తే శాన ! అర్దరూపా యిసి రేసి "ఒట్టుకుపోయి గలాసు దేసుకోరా" అంటాడు. నేపోతే "చినీ మాకెల్లా" అని మరో పావలిసురుతాడు. ఒక్కోసుట్టు రూపాయకి తక్కువియ్యడు ; పైడ్రాజుబాబు దరమ ప్రెబువు : !"

పైడ్రాజుగారు ఇప్పు డెక్కడ దొరుకుతార్సార్ ? బాగా రాత్ర యిందికదా ? ఎక్కడుంటా రంటారు ?

టైమెంతయింది ?

తొమ్మిద్దాటింది,

అయితే ఆఫీసు మేడ్నుంచి బంగాళాకి వెళ్ళిపోతారు. ఈ పాటికి భోజనం అయ్యుంటుంది. అయితే, ఇంకా పడుకోల్లెండి. ఫ్రంట్ హాల్లో పరివారంతో కూర్చుంటారు. కూర్చుని, కొడుకుతో ఆడుకుం టారు; రోజల్లా తీరిక ఉండదు కదా ! రాత్రి కాస్త తీరిక, అయితే,

పైడ్రాజుబాబు ఇంటికొచ్చేదాకా, ఎంతరాత్రయినా సరే, చినబాబు పడుకోడు. తండ్రంటే కుర్రాడికి అంత అభిమానం. కుర్రాణ్ని చూసేరా? దొర కుర్రాళ్ళా ఉంటాడు. పైడ్రాజు బాబుకి కొడుకంటే ప్రాణం! అసలే అభిమానాల మనిషి! అందులోనూ కొడుకంటే ప్రాణం కాదా మరి?! ఆ చినబాబుని పెద్దచదువు చదివించి హైకోర్టు జడ్జిపని ఆ బాబుచేత చేయించాలని పైడ్రాజు బాబుకి అదో సర్దా? తన కొడుకు పెద్దవాడయి న్యాయం నిలబెట్టా లంటాడు? ఒక్కొక్క తండ్రికి ఒక్కొక్క సర్దా! ఏం చెప్తాం?

కుమారుడి భావిగురించి పైడ్రాజుగారి తియ్యనికోరిక ఏమిటో మీకు స్వయంగా వినాలని ఉందా? అయితే, రండి. వినండి.

"మావోడు ఐకోర్టు జెడిజీ అవాల! అవుతాడు సూడండి! నా నింతవుతానని నా నొప్పుడైన కలగన్నాన? లేదే! కాని, అయినాను గదా! అలాగే ఊడూనూ! ఏఁరా ఎంకటేస్వెర్రావూ, సిన్నీ! నువ్వు ఐకోర్టు జెడిజీ వవుతావా?"

బంగారుబాబు సోఫాలో తండ్రి కెదురుగా కూర్చుని ఉంటాడు; హైకోర్టు జడ్జిని అవుతానని ఖచ్చితంగా తలూపి చెప్తాడు.

"ఐకోర్టు జెడ్జివై, ఏటి జేస్తావురా?"

బంగారుబాబు తన ఎడమచేత్తో ఊరివైపు చూపిస్తూ,

"ఎదవలందరికీ ఉరేసేస్తాన్!" అని ఎంతో ముద్దుగా అంటాడు.

పైడ్రాజుబాబుగారి బంగారు కొడుకు ఊరిజనం అందరికీ ఉరి వేస్తానన్నందుకు పైడ్రాజుబాబూ అతని పరివారమూ కలిసి పరమానంద భరితులయి పగలబడి నవ్వుతారు.

పైడ్రాజుబాబు "న్యాయమైన మనిషి!" మరి అతనికొడుకు న్యాయం నిలబెట్టి తండ్రి గౌరవం నిలబెట్టడా?? ఎంత మాట!